ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

మంగళవారం 4 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 48 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


## బీజేపీకి భారీ షాక్

**బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్**



2

19,324 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు

మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానం కైవసం

ఎన్నికల బరిలో తొలి విజయాన్ని అందుకున్న జన సురాజ్ పార్టీ



2

సుప్రీంకోర్టులో
## జడ్జిల సంఖ్య పెంపు

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

# గల్లీ సీన్..
# ఢిల్లీలో రిపీట్?


తెలంగాణలో ప్రజా, ఉద్యోగ, విద్యార్థి, రాజకీయ ఆందోళనలకు ఇందిరా పార్క్ కీలక వేదికగా నిలిచింది. అక్కడ నిరసనలకు ఆంక్షలు పెరిగిన కాలాన్ని, అప్పటి ప్రభుత్వంపై పెరిగిన అసంతృప్తిని ఇప్పుడు రాజకీయ వర్గాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. అయితే ఇందిరా పార్క్ పరిణామాలను మాత్రమే బీఆర్ఎస్ ఓటమికి కారణంగా చెప్పడం సరికాదు. ప్రజా వ్యతిరేకత, పాలనపై అసంతృప్తి, ఎన్నికల హామీలు, స్థానిక రాజకీయ సమీకరణాలు.. ఇలా అనేక అంశాలు 2023లో అధికార మార్పుకు కారణమయ్యాయి.

- (హైదరాబాద్ బ్యూరో - సింగిడి)

**ఇందిరా పార్క్ మూసివేత..**

**బీఆర్ఎస్‌కు ఓటమి**

- జంతర్ మంతర్ పై ఆంక్షలు.. ఢిల్లీలో కొత్త చర్చ
- నిరసనలపై నియంత్రణ.. ప్రభుత్వాలకు రాజకీయ పరీక్ష
- గల్లీ రాజకీయం.. ఢిల్లీలోనూ రిపీట్ అవుతుందా?



**ఇప్పుడు జంతర్ మంతర్ వంతు**

దేశ రాజధానిలో జంతర్ మంతర్‌ది కూడా అదే తరహా రాజకీయ ప్రాధాన్యం. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు అక్కడ నిరసనలు నిర్వహించాయి. అలాంటి వేదికపై ఆంక్షలు, నియంత్రణలు చర్చకు రావడంతో ప్రజా నిరసనలకు స్థలం ఎంత? ప్రభుత్వ వ్యతిరేక స్వరాలకు అవకాశం ఎంత? అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

**గల్లీ సీన్.. ఢిల్లీలో రిపీట్..**

ఇక్కడే తెలంగాణ, ఢిల్లీ రాజకీయాల మధ్య పోలిక మొదలవుతోంది. తెలంగాణలో సుదీర్ఘ పాలన తర్వాత బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయింది. కేంద్రంలో బీజేపీ కూడా దీర్ఘకాలంగా అధికారంలో ఉండటంతో యాంటీ, ఇంకంబెన్సీపై చర్చ సహజమే. కానీ రెండు పరిస్థితులను అచ్చుగుద్దినట్లు పోల్చడం మాత్రం సాధ్యం కాదు. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే అంశాలు, జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే అంశాలు వేర్వేరుగా ఉంటాయి.

**బీజేపీకి అసలు పరీక్ష.. ప్రజాభిప్రాయమే**

జంతర్ మంతర్‌పై ఆంక్షల కంటే బీజేపీకి అసలు సవాలు ప్రజల్లో ప్రభుత్వంపై ఏర్పడే అభిప్రాయమే. నిరుద్యోగం, ధరలు, రైతు సమస్యలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితి, రాష్ట్రాలతో సంబంధాలు, ప్రతిపక్షాల బలం వంటి అంశాలు భవిష్యత్ ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చు. అదే సమయంలో బీజేపీకి బలమైన సంస్థాగత నిర్మాణం, విస్తృత ఓటు బేస్, నరేంద్ర మోదీ నాయకత్వ ప్రభావం వంటి అంశాలు రక్షణగా ఉన్నాయి.

**తాళాలు కాదు.. తీర్పే తుది**

ఇందిరా పార్క్ అయినా.. జంతర్ మంతర్ అయినా.. నిరసన వేదికపై ఆంక్షలు విధించడం ఒక్కటే ప్రభుత్వ పతనానికి సంకేతం కాదు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి వెనుక అనేక కారణాలు పనిచేసినట్టే.. ఢిల్లీలో బీజేపీ భవిష్యత్తును కూడా అనేక రాజకీయ, సామాజిక అంశాలే నిర్ణయిస్తాయి. ఇందిరా పార్క్ మూసేశారు.. బీఆర్ఎస్ ఓడింది.. జంతర్ మంతర్‌పై ఆంక్షలు వచ్చాయి.. బీజేపీ ఇంటికేనా? అన్నది ప్రశ్నే.. కానీ సమాధానం మాత్రం ప్రజల ఓటు నిర్ణయిస్తుంది.



నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు..
## దేశంలోనే కొత్త రికార్డ్!

**మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్

90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ

నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది.

2

హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)



## మరో పేపర్ లీక్

ఆందోళనలు ఉద్ధృతం.. మద్దతు తెలిపిన సీజేపీ

2

కర్ణాటక కాంగ్రెస్‌లో
## క్యాబినెట్ విస్తరణ కలకలం

**పలువురు ఎమ్మెల్యేల రాజీనామా**



పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో
## బీఆర్ఎస్ రాజకీయం

"మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ

అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

2

తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు.

- హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)

పెద్ది సుదర్శన్ రెడ్డిపై
## తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి


**అది అత్యంత బాధాకరం: కేటీఆర్**

2

సుదర్శన్ రెడ్డి ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడేవారన్న కేటీఆర్

విద్యాశాఖలోని బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని వెల్లడి

అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని మండిపాటు



దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపై తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్న ఆరోపణలు నిజమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను ఏ ఒక్కరినీ వదలకుండా వేధింపులకు, టార్చర్‌కు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు.

- హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)

ఎవరి సాయం లేకుండా
## ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?

యూత్ డిక్లరేషన్ హామీలు అమలు కావడం లేదని ఆరోపణ

పోలీసు నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీత

రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం.. రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్

**నిరుద్యోగుల అంశంలో కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు**

2

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో
## కొత్త ట్విస్ట్..

మరో మహిళతోనూ సంబంధం.. దర్యాప్తులో సంచలన నిజాలు!

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కీలక పురోగతి

నిందితుడి గదిలో కత్తి, రెండు ప్రేమలేఖలు స్వాధీనం

ఏపీకి చెందిన వివాహితతో సంబంధం ఉన్నట్లు గుర్తింపు

బాధితురాలిని కలిసిన తర్వాత ఉదయ్‌కు దూరమైన వివాహిత

నిందితుడిని కస్టడీకి కోరనున్న పోలీసులు

2





కోర్టులో లొంగిపోయిన
## తమ్మినేని కుమారుడు

**బెయిల్ మంజూరు**

శ్రీకాకుళం జిల్లా చాపరం భూకబ్జా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట చిరంజీవి నాగ్ సోమవారం శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయారు. విచారణ సందర్భంగా ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది.

అమరావతి, ఆగస్టు 3 (సింగిడి)




మాజీ మంత్రి అప్పలరాజు
## పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి

**కాశీబుగ్గ, ఆగస్టు 3 (సింగిడి)**

వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఒక రోజు పోలీస్ కస్టడీకి పలాస జూనియర్ సివిల్ జడ్జి అనుమతిచ్చారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గతనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ, సిద్దార్థ త్యాడీలను పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో ఏ3గా ఉన్న అప్పలరాజును అరెస్టు చేయగా ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా అంపోలులోని జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో పలాస పోలీసులు అప్పలరాజు కస్టడీకి పిటిషన్ వేయగా ఒక రోజు అనుమతిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు విచారించే అవకాశముంది.

ఎల్ నినో వర్షాభావ పరిస్థితులపై
## సీఎం చంద్రబాబు సమీక్ష

**తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశం**



పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం

వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ

రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు.

అమరావతి, ఆగస్టు 3 (సింగిడి)

## ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు

**ఉజ్జయిని రంగంలో అమ్మవారి హెచ్చరిక!**

2



లష్కర్ బోనాల్లో కీలకమైన రంగం కార్యక్రమం

ఈసారి తీవ్ర ఆగ్రహంతో ఉన్నానన్న ఉజ్జయిని మహంకాళి

కుంభవృష్టి, అగ్నిప్రమాదాలు తప్పవని హెచ్చరిక

ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ఠ చేయాలని అమ్మవారి ఆదేశం

తప్పితే భారీ ప్రాణనష్టం తప్పదని భవిష్యవాణి

హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో లష్కర్ బోనాల ఉత్సవాల్లో భాగంగా నేడు అత్యంత కీలకమైన 'రంగం' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మాతంగి స్వర్ణలత పచ్చి మట్టికుండపై నిలబడి అమ్మవారి తరఫున భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది తాను తీవ్ర ఆగ్రహంతో ఉన్నానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నానని అమ్మవారు తన వాణిలో హెచ్చరించారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
4 ఆగస్టు 2026

## నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు..
# దేశంలోనే కొత్త రికార్డ్!

ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది.రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డిపై
## తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి

సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేవారని, ప్రభుత్వంలోని అక్రమాలను నిరంతరం బయటపెట్టేవారని కేటీఆర్ గుర్తుచేశారు. సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలోని బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని చెప్పారు. ఆ ఆధారాలను ఈడీ కార్యాలయానికి అందజేయడమే కాకుండా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని తెలిపారు. అయితే, సుదర్శన్ రెడ్డి మరణించిన మరునాడే సుప్రీంకోర్టు నుంచి నోటీసులు జారీ అవుతూ గైడెన్స్ రావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వ్యక్తులు ఆయన విమర్శలను తట్టుకోలేక, అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను ప్రధాని మోదీ నిలిపివేసారని సీఎం రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని, ఆయన చేసిన తీర్మానం కేవలం ఒక చిత్తు కాగితమని కొట్టిపారేశారు. సోనియా గాంధీ తెచ్చిన విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారా అని ప్రశ్నించారు. గురుకులాల్లో 150 మంది విద్యార్థులు చనిపోవడం, 7 వేల ఐటీ ఉద్యోగాలు పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. గోదావరిలో నీళ్లు సముద్రం పాలు అవుతున్నా రైతాంగానికి నీళ్లందించకుండా ఎండబెడుతున్నారని మండిపడ్డారు. పంపింగ్ ద్వారా నీళ్లు మిడ్ మానేరుకు ఎలా వస్తున్నాయో తెలియని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హెలికాప్టర్లలో వెళ్లి పోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేయడం వెనుక రూ.200 కోట్లు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు వేసిన స్కెచ్ ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే కుట్రలు సాగుతున్నాయని అన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో
# బీఆర్ఎస్ రాజకీయం

పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో
# కొత్త ట్విస్ట్..

**హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)**

తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఒక కత్తి, వేర్వేరు చేతిరాతలతో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖల ఆధారంగా ఆరా తీయగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వివాహితతో ఉదయ్‌కు సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2014లో వివాహమైన సదరు మహిళ, 2023 నుంచి భర్తకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆమెకు ఉదయ్‌తో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఉదయ్ సూచన మేరకే ఆ మహిళ తన పాత ఉద్యోగాన్ని వదిలేసి, అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉందామని ఉదయ్ ప్రతిపాదించగా, చట్టబద్ధంగా విడాకులు రాకపోవడంతో ఆమె నిరాకరించినట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలకమైన విషయం ఏమిటంటే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితురాలైన ట్రైనీ ఐపీఎస్ అధికారిణి, సదరు వివాహితను కలిసి ఉదయ్ కృష్ణారెడ్డి విపరీత ప్రవర్తన, తనపై జరిపిన దాడుల గురించి వివరించారు. దీంతో అతడి నిజస్వరూపం తెలుసుకున్న ఆ మహిళ, అప్పటి నుంచి ఉదయ్‌కు దూరంగా ఉంటున్నట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. బాధితురాలి గదిలోకి ఉదయ్ బలవంతంగా ప్రవేశించి ఆమె ఫోన్‌ను లాక్కున్నట్లు కూడా పోలీసులకు బలమైన ఆధారాలు లభించాయి. శిక్షణ సమయంలోనూ ఉదయ్ అతి కోపం, ప్రవర్తన కారణంగా తోటి అధికారులు మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. ఈ కేసులో భాగంగా పోలీసులు ఇప్పటివరకు దాదాపు 20 మంది నుంచి వాంగ్మూలాలు సేకరించారు. కేసు లోతుల్లోకి వెళ్లి మరిన్ని వివరాలు రాబట్టేందుకు నిందితుడిని పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)**

తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వర్షాల ప్రభావం దక్షిణ, తూర్పు, ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాలపై ఉండే అవకాశం ఉంది, కొన్ని చోట్ల ఉరుములు, బలమైన గాలులు వీచే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఉరుములతో కూడిన వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచిన ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు కోరారు. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో ఈ రోజు రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?

**హైదరాబాద్, ఆగస్టు 3 (సింగిడి)**

తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని విమర్శించారు. ఉద్యోగాలు రాక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమని అన్నారు.



రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరుద్యోగులు అడిగితే సీఎం రేవంత్ రెడ్డి ''ఎండ్రిన్ తాగి చావండి'' అన్నట్లుగా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సీఎం రేవంత్ సంబోధించడం బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపిస్తూ ''అసలైన క్రిమినల్ వేస్ట్ ఆయనే'' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతితో తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణ నిరుద్యోగుల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు.

సీఎం రేవంత్ రెడ్డి విద్యార్హతపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఆయన అసలు ఏం చదివారో కూడా అనుమానమేనని అన్నారు. ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్‌ను నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూకైనా హాజరయ్యారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల కష్టాలు రేవంత్‌కు ఏమాత్రం తెలియవని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా, కేంద్ర నిధుల కొరత ఉన్నా రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తుందో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య పెంపు

### సుప్రీంకోర్టు మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంచే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### భారతీయ గణాంక సంస్థ బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (సింగిడి)**

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం, అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల చోరీ ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగలేదు. పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. మధ్యాహ్నం అనంతరం సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదు. ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లకుండా నినాదాలు కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును సభలో ప్రవేశపెట్టి దాని ఉద్దేశాన్ని సంక్షిప్తంగా వివరించారు.

**అనేకసార్లు విజ్ఞప్తి చేసినా!**

అయితే స్పీకర్ సభ్యులను పలుమార్లు శాంతించాలని



కోరారు. బిల్లుపై చర్చలో పాల్గొనాలని, సభా సంప్రదాయాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అయితే విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో చర్చ జరగలేదు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా సభ ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షం తీసుకొచ్చిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు. ఈ సవరణ బిల్లు ప్రకారం ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అనుమతించిన సంఖ్యను 33 నుంచి 37కు పెంచనున్నారు. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు చేరుతుంది. సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల సంఖ్య, న్యాయమూర్తులపై అధిక పని భారం, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే సభను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. గత వారం కూడా జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు విపక్షాల ఆందోళనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించింది.మరో కీలక బిల్లును కూడా! ఇదిలా ఉండగా, సోమవారం లోక్‌సభలో మరో కీలక బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్-ఐఎస్ఐ)కు సమగ్ర చట్టపరమైన వ్యవస్థను కల్పించే భారతీయ గణాంక సంస్థ బిల్లు-2026ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లు ద్వారా ప్రస్తుతం 1959 చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. ఐఎస్ఐను బాడీ కార్పొరేట్‌గా ఏర్పాటు చేసి పాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్యా, పరిశోధనా రంగాల్లో ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడం, గణాంక శాస్త్రం, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, పరిమాణాత్మక ఆర్థిక శాస్త్రం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవసరాలకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దడం బిల్లు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. కొత్త చట్టం ప్రకారం భారత రాష్ట్రపతి ఐఎస్ఐకి విజిటర్‌గా వ్యవహరిస్తారు. సంస్థ నిర్వహణ కోసం ఛైర్మన్ నేతృత్వంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఏర్పాటు చేయనున్నారు. విద్యా విధానాల రూపకల్పన, పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, జవాబుదారీతనం వంటి అంశాలకు మరింత స్పష్టమైన చట్టపరమైన రూపురేఖలు కల్పించనున్నారు. అలాగే డైరెక్టర్ నేతృత్వంలో అకడమిక్ కౌన్సిల్ ఏర్పాటు చేసి పూర్తి కాల అధ్యాపకులను అందులో సభ్యులుగా చేర్చే ప్రతిపాదన కూడా బిల్లులో ఉంది. అయితే ఆ బిల్లు ప్రవేశపెట్టే సమయంలో కూడా విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించారు.

## ఈ ఏడాది కుంభవృష్టి
# వర్షాలు

ప్రజల ప్రవర్తన తనను కంటతడి పెట్టిస్తోందని, మనశ్శాంతి లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యవాణిలో స్వర్ణలత మాట్లాడుతూ.. "నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తానని మాటిచ్చి నిలబెట్టుకోలేదు. అయినా ప్రజలను నేను కాపాడుతూనే ఉన్నా. ఏ ఆపద వచ్చినా అడ్డుకుంటున్నా. కానీ నా మాట మీరు వినడం లేదు. ఇది నాకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ ఏడాది కుంభవృష్టి రూపంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని, వాటి వల్ల ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు వావివరసలు మరిచి ప్రవర్తిస్తున్నారు. ఘోరాలు చేస్తున్నారు. వారిని నేను వదిలిపెట్టను" అని చెప్పారు. తనకు ఇచ్చిన మాట ప్రకారం రాబోయే ఆరు నెలల్లోగా విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని అమ్మవారు ఆదేశించారు. అలా చేయని పక్షంలో భారీ ప్రాణనష్టం జరిపిస్తానని హెచ్చరించారు. "నాకు అడ్డు వచ్చిన వాళ్లను పాదాల కింద వేసి నలిపేస్తా. మీరు గాలికి వదిలేసిన పిల్లల్ని నేను కాపాడుతా. కానీ మీరు నన్ను నిరుత్సాహపరుస్తున్నారు" అంటూ స్వర్ణలత అమ్మవారి వాణిని వినిపించారు. అంతకుముందు నిన్న తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో సందడిగా మారింది. ప్రతి ఏటా రంగంలో వెలువడే భవిష్యవాణికి భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఈసారి అమ్మవారి హెచ్చరికలు భక్తుల్లో చర్చనీయాంశంగా మారాయి.

## కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు

భూ కబ్జా ఆరోపణలకు సంబంధించిన కేసులో చిరంజీవి నాగ్‌ను ఏ5 (5వ నిందితుడు)గా చేర్చారు. ఈ క్రమంలో సోమవారం ఆయన కోర్టు ఎదుట హాజరయ్యారు. విచారణ సమయంలో, తన ఆరోగ్య పరిస్థితిని చిరంజీవి నాగ్ కోర్టుకు వివరించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అనంతరం, ఈ నెల 10వ తేదీన జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని చిరంజీవి నాగ్‌ను కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో చిరంజీవి నాగ్ తండ్రి తమ్మినేని సీతారాం ఏ6 (6వ నిందితుడు)గా, ఆయన తల్లి వాణిశ్రీ ఏ7 (7వ నిందితురాలు)గా ఉన్నారు. ఒకే కేసులో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ముగ్గురూ నిందితులుగా ఉండటం గమనార్హం.

## బీజేపీకి భారీ షాక్

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్లు ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచీ (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



## కర్ణాటక కాంగ్రెస్‌లో
# క్యాబినెట్ విస్తరణ కలకలం

### పలువురు ఎమ్మెల్యేల రాజీనామా..!

**బెంగళూరు, ఆగస్టు 3 (సింగిడి)**

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి బయటపడింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలో మంత్రివర్గ విస్తరణ కు ముహూర్తం ఖరారైన వేళ పార్టీలో అసంతృప్త జ్వాలలు వెల్లువెత్తాయి. క్యాబినెట్‌లో చోటు దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశవంతరాయగౌడ వి పాటిల్ తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణికి అందజేశారు. అదేవిధంగా బేలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బేలూరు గోపాలకృష్ణ సైతం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి కాంగ్రెస్ అధిష్ఠానానికి షాకిచ్చారు. తమతోపాటు మరో 10 మంది ఎమ్మెల్యేలు కూడా రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ క్యాబినెట్‌లోకి కొత్తగా 20 మంది మంత్రులను చేర్చుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే వరుస రాజీనామాలు, ఎమ్మెల్యేల అసంతృప్తితో రాజధాని బెంగళూరులో తీవ్ర కలకలం రేగింది. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# మరో పేపర్ లీక్

### ఆందోళనలు ఉద్ధృతం.. మద్దతు తెలిపిన సీజేపీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (సింగిడి)**

నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది.

''జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం'' అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు

**పరీక్షల్లో అవకతవకలు.. ఆ 158 కేసులపై సీబీ'ఐ'**


పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. ''పలు పోటీ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్లు వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించింది'' అని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. ''నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుంది'' అని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఎల్ నినో వర్షాభావ పరిస్థితులపై
# సీఎం చంద్రబాబు సమీక్ష

రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.



ప్రభాతనవ **సింగిడి**
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
04-8-2026



## ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు..

# క్రియాశీలకంగా సహకరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (సింగిడి):** జిల్లాలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్ఠంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సూచనలు, సహకారం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ, డిజిటలైజేషన్ పురోగతి, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే తమ బూత్ స్థాయి అధికారి (బీఎల్వో)కి లేదా సంబంధిత హెల్ప్‌డెస్క్‌లో ఫారాలు అందజేయాలని కోరారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 78.50 శాతం పూర్తయిందని తెలిపారు. నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయడానికి నిరంతర పర్యవేక్షణతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ (పునర్వ్యవస్థీకరణ) ప్రక్రియ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఓటరు జాబితాలో గుర్తించిన వ్యత్యాసాల (అనామలీస్)కు సంబంధించి ఆయా ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి వివరాలను వెల్లడిస్తూ, నారాయణఖేడ్‌లో 88 శాతం, ఆందోల్‌లో 87 శాతం, జహీరాబాద్‌లో 81 శాతం, సంగారెడ్డిలో 79 శాతం, పటాన్‌చెరులో 66 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు
# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి






- అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (సింగిడి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారికి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాంపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

స్వాగతం పలికిన నాగారం కాంగ్రెస్ నాయకులు



**కీసర, జూలై 3, (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లిలో నిర్వహించిన మహంకాళి బోనాల మహోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహోదరులు అనిల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందాడి అంజిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు, అనిల్ రెడ్డికి, కందాడి అంజిరెడ్డికి నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మైపాల్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇందిరా శోభన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సంధ్యా రెడ్డి, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ కిరణ్ జ్యోతి, ప్రవీణ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పంగా సంతోష్, ఓంప్రకాష్ గౌడ్, పొట్ట శ్రీశైలం, పొట్ట పర్మేశ్, పొట్ట విష్ణువర్ధన్, పంగా శ్రీహరి, రవి గారు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం



**జవహర్ నగర్, ఆగస్టు 3 (సింగిడి):** మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ అంబేద్కర్ నగర్లో రమాచారి, ధనలక్ష్మి, దంపతులు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. రమాచారి కుమారుడు అఖిల్(24) చిన్న నాటి నుంచే బుద్ధిమాంద్యంతో పెరిగినాడు. ఈ క్రమంలో జూలై 26న అఖిల్ ఇంట్లో చెప్పకుండ బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు జవహర్ నగర్ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించండి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం



**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 3 (సింగిడి):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి (128) దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామని నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. ఆదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తుల పై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

జీసీఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌కు వినతిపత్రం అందజేత



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (సింగిడి):** రానున్న బోనాల పండగ సందర్భంగా జీడిమెట్ల సర్కిల్ 286, 287 డివిజన్లలోని దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వి. నరేందర్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో జీసీఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రజావాణి సందర్భంగా వి. నరేందర్ రెడ్డి చేసిన ప్రధాన డిమాండ్లలో దేవాలయాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి. చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలి, భక్తులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించాలి, అన్ని వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలి. డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలి. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వివరించారు. ఈ సందర్భంగా వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా వేలాది మంది భక్తులు దేవాలయాలను సందర్శించే నేపథ్యంలో అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేసి పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వెలుగులు, డ్రైనేజీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా కల్పించాలని కోరారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వినతి పత్రం సమర్పించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆటో బలరాం, రామచంద్రారెడ్డి, రామ్మోహన్, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొని, బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## యుజిడి పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గ్రామం, 296వ డివిజన్‌లో ఉన్న డ్రైనేజీ, మౌలిక సదుపాయాల సమస్యలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి రాగా, ఆయన ప్రత్యేక చొరవతో సీఎంసీ నిధుల నుంచి రూ. 70 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో దుండిగల్ గ్రామంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యు జి డి) అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఆకుల మల్లేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్ కుమార్ పటేల్, కావలి శక్తి కుమార్, ఆకుల మధు, చిన్న ముత్యం రెడ్డి, బిక్షపతి రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 3 (సింగిడి):** శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత విలువైన తొలి ఆహారమని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించే పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను శిశువుకు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అవి శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తల్లీ-శిశువు మధ్య బంధం మరింత బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా ఓ శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆర్టీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేర్ హాస్పిటల్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలా
- మలక్‌పేట్‌లో అత్యాధునిక మెడికల్ ఐసీయూ ప్రారంభించిన కేర్ హాస్పిటల్స్



**ఎల్బీనగర్, ఆగస్టు 3 (సింగిడి):** తెలంగాణ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేర్ హాస్పిటల్స్ నిరంతరం అధునిక వైద్య మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టడం అభినందనీయం అని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలా అన్నారు. సోమవారం మలక్‌పేట్ కేర్ హాస్పిటల్స్ నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ఎమ్మెల్యే బలాలు ముఖ్య అతిథిగా హాజరై క్వార్ట్ డీఎం క్యాపిటల్ కేర్ లిమిటెడ్ సీఈఓ డా. పవన్ కుమార్, రీజనల్ సీఈఓ నిలేష్ గుప్తా, కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ సీఓఓ ప్రవీణ్ కుమార్ ఎడ్ల, అజంపురా కార్పొరేటర్ షేక్ మోహినుద్దీన్ అబ్రార్, మెడికల్ సూపరింటెండెంట్ డా. శ్రీధర్, డాక్టర్ వజ్రపు రాజేంద్ర, సీనియర్ కన్సల్టెంట్, హెచ్ఓడీ -- క్రిటికల్ కేర్, సీనియర్ వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా మాట్లాడుతూ, "వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు నాణ్యమైన వైద్య మౌలిక సదుపాయాలు ఎంతో అవసరం. కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్‌లో ప్రారంభమైన ఈ అత్యాధునిక ఎంఐసీయూ అత్యవసర, క్రిటికల్ కేర్ సేవలను మరింత బలోపేతం చేస్తుంది. ఇంటికి దగ్గర్లోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రాణాలను కాపాడే విషయంలో కీలకంగా మారుతుందన్నారు. రాబోయే రోజుల్లో కూడా రోగులకు తక్కువ ఫీజులతో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం డీఎం క్యాపిటల్ కేర్ లిమిటెడ్ సీఈఓ డా. పవన్ కుమార్, రీజనల్ సీఈఓ నిలేష్ గుప్తా, కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ సీఓఓ ప్రవీణ్ కుమార్ ఎడ్ల లు మాట్లాడుతూ రోగులకు తక్షణ చికిత్స, నిరంతర పర్యవేక్షణ, వివిధ విభాగాల వైద్యుల సమన్వయంతో చికిత్స అందించేందుకు ఈ ఎంఐసీయూను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొన్నారు. 24 గంటల పాటు సేవలందించేలా ఏర్పాటు చేసిన ఈ ఎంఐసీయూలో అత్యాధునిక పేషెంట్ మానిటరింగ్ వ్యవస్థలు, లైఫ్ సపోర్ట్ పరికరాలు, ఆధునిక క్రిటికల్ కేర్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. అనుభవజ్ఞులైన ఇంటెన్సివిస్టులు, స్పెషలిస్ట్ వైద్యులు, శిక్షణ పొందిన క్రిటికల్ కేర్ నర్సులు, బహుళ విభాగాల వైద్య బృందం కలిసి క్లిష్టమైన అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా ఈ యూనిట్‌ను రూపొందించారు. కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో క్రిటికల్ కేర్ సేవలను మరింత బలోపేతం చేసే వ్యూహంలో భాగంగానే ఈ ఆధునిక ఎంఐసీయూను ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఆధునిక సాంకేతికత, వైద్య మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందంతో అత్యవసర, క్లిష్ట వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు చేరువ చేయడంలో కేర్ హాస్పిటల్స్ తన నిబద్ధతను కొనసాగిస్తోందని తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (సింగిడి):** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నేటి ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌లో 48, సంగారెడ్డి డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 7, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు అందగా, ఆందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, ఉపాధి (పంచాయతీరాజ్), పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో దుబ్బాక విద్యార్థుల సత్తా

- రెండు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్య పతకాలతో మెరిసిన విద్యార్థులు



**దుబ్బాక, ఆగస్టు 3 (సింగిడి):** అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ, ఆరు రజత, మూడు కాంస్య పతకాలను సాధించి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై చాటారు. ఈ విషయాన్ని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, వనస్థలిపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన రెండో అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో భారత్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మలేషియా సహా సుమారు 30 దేశాలకు చెందిన 3,000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో దుబ్బాకకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించి ప్రతిభ చాటారు. లచ్చపేట ఆదర్శ పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ కట విభాగంలో స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో రజత పతకం సాధించగా, సరస్వతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన రిత్విక స్వర్ణ పతకం, శిల్పిత రజత పతకం గెలుచుకున్నారు. మాస్టర్ మైండ్ స్కూల్ విద్యార్థులు రిషి, అఖిల్, సర్వజ్ఞ రజత పతకాలు, ప్రణవి, సాత్విక్ కాంస్య పతకాలు సాధించారు. గాయత్రి వివేకానంద విద్యాలయానికి చెందిన మనస్విన్ కట విభాగంలో రజతం, కుమిటే విభాగంలో కాంస్య పతకం గెలుచుకోగా, దిశా స్కూల్ విద్యార్థి ఆరావ్ రజత పతకం సాధించాడు. విజేతలను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, సరస్వతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ హరిబాబు, దిశా స్కూల్ ప్రిన్సిపాల్ కమలాకర్, యాదగిరి, గాయత్రి వివేకానంద విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఫౌండర్ అండ్ డైరెక్టర్ బురాని శ్రీకాంత్, రేంజర్ షోటోకన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా వ్యవస్థాపకులు మాస్టర్ నగేష్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, పైనాపిల్ షోటోకన్ కరాటే అకాడమీ ఫౌండర్ సురేందర్ సుబ్బు, టెక్నిక్స్ అకాడమీ ఫౌండర్ నాగరాజు, శ్రీ టీఎస్ లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా బురాని శ్రీకాంత్ మాట్లాడుతూ, దుబ్బాక విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై సాధించిన విజయం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయి పోటీల్లో రాణించేందుకు అకాడమీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# సాంప్రదాయ నృత్య కళాకారిణి యామిని

# ఎడిటోరియల్

Editorial

## హామీలను మోసగిస్తున్న పాలకులు !

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్దం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2, శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది. రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ. 5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.



యామినీ కృష్ణమూర్తి. నాట్య కళతో పెనవేసుకున్న ఈ పేరు వినని భారతీయులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ మూడు సొంతం చేసుకున్న ప్రతిభా శాలి. నాట్య కళా రీతు లైన భరత నాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో పరి పూర్ణత్వం సాధించిన ప్రముఖ నాట్య శాస్త్ర కోవిదు రాలు. దేశ విదేశాల్లో వేలాది నాట్య ప్రదర్శనలు ఇవ్వడమే కాక, విదేశాల్లో కూచిపూడి నాట్యానికి మిగుల ప్రచారం కల్పించిన ప్రతిభాశాలి.

వివిధ రకాల నృత్యాలను కళా పూర్ణులైన గురువుల వద్ద ఎంత నేర్చుకున్నా, తనదంటూ ప్రత్యేక ఒరవడి, బాణీని ఏర్పరకుని ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

ప్రదర్శించేది ఏ నాట్య రకమైనా, ఒకదాని కొకటి మేళవింపు కాకుండా, సాంప్రదాయ పద్ధతులను అతిక్ర మించకుండా, నృత్య రీతులను కలగాపులగం చేయకుండా ప్రదర్శించడం ఆమెకే సొంతం.

అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య గొప్ప తనాన్ని చాటి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, మదనపల్లిలో 1940 డిసెంబరు 20న జన్మించిన ఆమె కుటుంబంతో పాటు తమిళనాడు లోని చిదంబరంలో స్థిరపడింది.

ఆమె పూర్తి పేరు యామినీ పూర్ణతిలకం. తన తండ్రి ప్రోత్సాహంతో తన 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరత నాట్యము నేర్చుకోవడము ప్రారంభించింది. భరత నాట్యంలో ఈమె గురువులు కాంచీపురం ఎల్లప్ప పిళ్ళై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూర్ కిట్టప్ప, దండాయుధ పాణి, మైలాపూర్ గౌరి అమ్మ మొదలైనవారు. ఈమె వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చింది. పంకజ చరణ్‌దాస్, కేలూచరణ్ మహాపాత్రల వద్ద ఒడిస్సీ నేర్చుకొన్నది. ఎం.డి. రామనాథన్ దగ్గర కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకొంది. కర్ణాటక సంగీతం కూడా నేర్చుకుని పాటపాడ్తుతూ, భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించి, యామిని 1957లోతన 17వ యేట చెన్నైలో 1957వ సంవత్సరంలో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరు పొందినది. 20సంవత్సరాల వయసు వచ్చే సమయానికి ఈమె ఒక ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు పొంది, తన మకామును ఢిల్లీకి మార్చింది.

దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆకాశవాణి కోసం రచించిన క్షీరసాగర మధన" నృత్య రూపకాన్ని కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో, మొదటి సారి యామినీ కృష్ణమూర్తి "విశ్వమోహిని" పాత్రలో, ధన్వంతరి, మహావిష్ణువు పాత్రల్లో వేదాంతం సత్యనారాయణ శర్మ నటించి ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు.

భామాకలాపం"లో సత్యభామగా అవతరించే వైఖరి, "మండూక శబ్దం"లో కృష్ణదేవరాయల ప్రశస్తిని లీలగా చూపే అభినయం, భంగిమల్లోని ఠీవి, ఔచిత్యం, "సింహాసనస్థితే" శ్లోకంలో దేవిని కళ్ళకు కట్టిస్తూ పట్టే భంగిమలు, "కృష్ణశబ్దం"లో భావతీవ్రత, లాలిత్యం, వైవిధ్యం ఈమె ప్రతిభకు తార్కాణాలు. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం ఈమె పాండిత్యానికి ఉదాహరణ. కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేసింది. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాసింది.

"నృత్యమూర్తి" సీరియల్‌ను పదమూడు భాగాలుగా ఆమె రూపొందించి దూరదర్శన్‌లో ప్రసారం చేసింది. మన సంస్కృతీ వైభవానికి గోపురమై నర్తనశిల్పాల ఆధారంగా, స్థలపురాణాలు, చరిత్ర జోడించి వ్యాఘ్రపాద, పతంజలి సూక్తులు, కర్ణాటక సంగీతం రుచిచూపిస్తూ ఈ సీరియల్‌లో నృత్య సర్వస్వాన్ని ఇమిడ్చి చూపించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా నియమించ బడింది.

న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు ఈమె డైరెక్టరుగా సేవలను అందించడం తో పాటు, ఢిల్లీలో నృత్య కౌస్తుభ కల్చరల్ సోసైటి యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ అందించడంపై ప్రధానంగా దృష్టి సారించింది.

ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఏల్చూరి విజయరాఘవ రావు సంగీత దర్శకత్వంలో "యామినీ కృష్ణమూర్తి" పై 20 నిమిషాల ఒక డాక్యుమెంటరీ సినిమా తీసింది.



క్షీరసాగర మథనం నృత్య నాటికను భారత మలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ముందు ప్రదర్శించి ఆయన నుండి ,"భామావేణీ" బిరుదును అందుకున్నది. అంతే కాక యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ 2001లో పద్మ భూషణ్ 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది

2017లో విశాఖపట్నంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు ఈమెకు స్వర్ణకమలం బహూకరించి "నాట్య విద్యాభారతి" అనే బిరుదును ఇచ్చి సత్కరించారు.

వివాహం చేసుకోకుండా అవివాహితగానే వుండి నాట్యరంగానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేసిన కళా తపస్వి నిగా గుర్తింపు పొందినది.

ప్రముఖ భరతనాట్యం, కూచిపూడి కళాకారిణి యామినీ కృష్ణమూర్తి(84) వయస్సురీత్యా అనారోగ్య సమస్యలతో 2024 ఆగస్టు 3న తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## 60 ఏళ్ల తర్వాత బ్రిటీష్ బీర్ కిక్... భారత్‌లోకి లయన్


ఒకప్పుడు బ్రిటీష్ సామ్రాజ్య కాలంలో భారత గడ్డకు చేరిన ఓ బీర్ బ్రాండ్... ఇప్పుడు స్వతంత్ర భారతదేశంలో కొత్త ఆశలతో అడుగుపెట్టింది. దాదాపు ఆరు దశాబ్దాల విరామం తర్వాత లయన్ బ్రూవరీ కంపెనీ పునరాగమనం చేసింది. ఇది కేవలం ఓ బీర్ కంపెనీ మార్కెట్ ప్రవేశం కాదు... ప్రపంచ వ్యాపార సంస్థల దృష్టిలో భారతదేశం ఎంత కీలక మార్కెట్‌గా మారిందో చెప్పే మరో సంకేతం.

చరిత్ర నుంచి కొత్త ప్రయాణం వరకు

1836లో లండన్‌లో ప్రారంభమైన లయన్ బ్రూవరీ కంపెనీకి భారతదేశంతో పాత సంబంధం ఉంది. బ్రిటీష్ పాలన కాలంలో సముద్ర ప్రయాణాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండేలా ప్రత్యేకంగా తయారు చేసిన ఇండియా పేల్ ఏల్ తరహా బీర్లతో ఈ సంస్థకు పేరు వచ్చింది. కాలం మారింది. పాలనలు మారాయి. మార్కెట్లు మారాయి. కానీ ప్రపంచ వ్యాపార పటంలో భారత్ ప్రాధాన్యం మాత్రం రోజురోజుకూ పెరిగింది. ఇప్పుడు అదే భారత మార్కెట్‌లోకి లయన్ బ్రూవరీ కొత్త వ్యూహంతో తిరిగి వచ్చింది.

బీర్ మార్కెట్‌లో కొత్త పోటీ

భారత్‌లో బీర్ వినియోగం కూడా మారుతోంది. గతంలో కేవలం సాధారణ బీర్లకే పరిమితమైన మార్కెట్ ఇప్పుడు ప్రత్యేక రుచులు, నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాలను కోరుకునే స్థాయికి చేరింది. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో కొత్త తరం



వినియోగదారులు విభిన్న రకాల పానీయాలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఈ మార్పును గమనించిన అంతర్జాతీయ సంస్థలు భారత మార్కెట్‌లో అవకాశాలను వెతుకుతున్నాయి. లయన్ బ్రూవరీ కూడా ఇదే మారుతున్న ధోరణిని లక్ష్యంగా చేసుకుంది.

పాత పేరు... కొత్త వ్యూహం

ఒకప్పుడు బ్రిటీష్ కాలపు గుర్తింపుగా ఉన్న లయన్ బ్రూవరీ ఇప్పుడు ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తన ఉత్పత్తులను తీసుకొస్తోంది. తొలి దశలో ఢిల్లీలో ఐలాండ్ లాగర్, పేల్ ఏల్ రకాల బీర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అనంతరం ఇతర రాష్ట్రాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

భారత్‌పై ఎందుకు అంత ఆసక్తి?

ప్రపంచ కంపెనీలకు భారత్ ఇప్పుడు కేవలం జనాభా ఎక్కువగా ఉన్న దేశం కాదు. భారీ వినియోగదారుల వర్గం, వేగంగా పెరుగుతున్న నగరీకరణ, మారుతున్న జీవనశైలి కారణంగా ఇది భవిష్యత్ వృద్ధి కేంద్రంగా మారింది. అందుకే దశాబ్దాల చరిత్ర కలిగిన బ్రాండ్లు కూడా మళ్లీ భారత మార్కెట్ వైపు చూస్తున్నాయి.

లయన్ రాక వెనుక అసలు కథ

60 ఏళ్ల తర్వాత లయన్ బ్రూవరీ తిరిగి రావడం వెనుక ఒక వ్యాపార సందేశం ఉంది. ప్రపంచ మార్కెట్‌లో భారత్ స్థానం ఎంత వేగంగా మారుతోందో ఇది తెలియజేస్తోంది. ఒకప్పుడు బ్రిటీష్ పాలన కాలంలో భారత్‌కు వచ్చిన లయన్... ఇప్పుడు స్వతంత్ర భారతదేశంలోని కొత్త తరాన్ని ఆకట్టుకోవడానికి వస్తోంది. ఇది ఓ బీర్ బ్రాండ్ పునరాగమనం మాత్రమే కాదు... మారుతున్న భారత వినియోగ సంస్కృతికి అద్దం పట్టే మరో కథ.

కాలం మారినా మార్కెట్ విలువ మారదు. ఒకప్పుడు చరిత్రలో భాగమైన లయన్ బ్రూవరీ... ఇప్పుడు భవిష్యత్ అవకాశాల కోసం భారత గడ్డపై మళ్లీ అడుగు పెట్టింది. ఆరు దశాబ్దాల తర్వాత వచ్చిన ఈ పునరాగమనం ప్రపంచానికి భారత్ ఎంత కీలక మార్కెట్‌గా మారిందో చెప్పే సంకేతంగా నిలుస్తోంది.


**-శ్రీశైలం దూడం,**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9133947176.**



## లక్ష్మీదేవి వాహనం నిశాచర పక్షి గుడ్లగూబ

(04 ఆగష్టు "అంతర్జాతీయ గుడ్లగూబల అవగాహన దినోత్సవం" సందర్భంగా)

గుడ్లగూబ పెద్ద పెద్ద కనుగుడ్లతో అందవికారంగా, భయానకంగా కనిపిస్తాయి. దీన్ని అపశకున పక్షిగా భావించకుండా లక్ష్మీదేవి వాహనంగా చెప్పబడుతున్నది. నిశ్శబ్దంగా ఎగిరే స్వభావం కలిగిన ప్రత్యేక పక్షులైన గుడ్లగూబల లేదా ఔల్స్ రెక్కల ఈకలు రేపు పళ్ళ వలె ఉంటాయి. చిమ్మ చీకట్లో కూడా ఎగిరే గుడ్లగూబలు తమ తలను 270 డిగ్రీలు తిప్పగలవు. అంటార్కిటికా మినహా అన్ని ఖండాల అడవులు, ఎడారుల్లో కనిపిస్తున్నాయి. గుడ్లగూబల సమూహాన్ని "పార్లమెంట్" అని పిలుస్తారు. ఒక జత గుడ్లగూబలు తమ గూడు కట్టే సమయంలో దాదాపు 3,000 వరకు ఎలుకలను తిని రైతులకు మేలు చేస్తాయి. లోతైన మంచులో కూరుకు పోయిన ఎరను సహితం శబ్దం ద్వారా గుర్తించి పట్టుకోగలవు. గుడ్లగూబల ఈకలు, మచ్చలు చెట్ల



బోర్డు రంగులో కలిసిపోయి విశ్రాంతి సమయం లేదా వేటాడే సమయాల్లో సురక్షను పొందుతాయి.

గుడ్లగూబల పక్షిజాతి అంతరించరాదు :

నానాటికీ గుడ్లగూబల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా తగ్గిపోవడం ఓ ప్రమాద జీవ వైవిధ్య విఘాత హెచ్చరికగా భావించాలి. ఆవాసాల నష్టాలు, కాలుష్య సమస్యలు, పురుగు మందుల వాడకం, విషాహారాలు, విచక్షణారహిత వేటలతో గుడ్లగూబల జనాభా మూడింట ఒక వంతు క్రమంగా పడిపోయింది. జీవ వైవిధ్య పరిరక్షణలో గుడ్లగూబల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏటా 04 ఆగష్టు రోజు "అంతర్జాతీయ గుడ్లగూబల అవగాహన దినోత్సవం (ఇంటర్నేషనల్ ఔల్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. గుడ్లగూబల సంరక్షణ, వాటి ఆవాసాల రక్షణ, అవి ఎదుర్కొంటున్న ముప్పుల గూర్చి అవగాహన కల్పిస్తూ తీసుకోవలసిన చర్యలను చర్చించే వేదికగా ఈ దినోత్సవాలను వినియోగిణచుకొని విద్యాలయాల్లో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. పర్యావరణ సమతుల్యతకు గుడ్లగూబలు ఉండి తీరాల్సిందే అని తెలుసుకోవాలి.

విషపూరిత ఎలుకల మందుల వాడకాన్ని తగ్గించడం, వాటి ఆవాసానికా వీలుగా చెట్లను రక్షించడం, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కలిపించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా 200లకు పైగా గుడ్లగూబల జాతులు ఉన్నాయి. రాత్రిపూట మాత్రమే సంచరించే నిశాచర పక్షులు గుడ్లగూబలు. కొన్ని రకాల గుడ్లగూబలు పగటి పూట కూడా వేటాడగలవు. మాంసాహార పక్షులుగా వేటలో నేర్పరితనం కలిగిన గుడ్లగూబలు చిన్న కీటకాలు, బల్లులు, ఎలుకలు, పీతలు, పురుగులు లాంటి ఆహారాన్ని తింటాయి. గుడ్లగూబలు ఇంటిలోకి వస్తే అదృష్టం, ఐశ్వర్యం కలుగుతాయని నమ్ముతారు. కొన్ని ప్రాంతాల ప్రజలు వీటిని కీడు సంకేతంగా కూడా భావిస్తారు.



# శాకాంబరి అవతారంలో వాసవిమాత

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు
- ఆషాడం ప్రత్యేకత గోరింటాకు ఉత్సవం



**జమ్మికుంట, ఆగస్టు 3 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం శాకంబరి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించగా భక్తులకు శాఖాంబరి అవతారంలో వాసవి మాత దర్శనమిచ్చారు. ఆషాడ మాసం పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించగా మరదలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారు శాంత స్వరూపిని రూపంలో శాఖంబరిగా ఉంటుందని భావించిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పండితులు వెంకటనారాయణ ఆధ్వర్యంలో వాసవి మాతను శాఖంబరిగా అలంకరింపజేసిన అనంతరం గోరింటాకు ఉత్సవాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ అమ్మవారు శాంతస్వరూపిణిగా శాఖంబరిగా అవతారంలో ఉండడం ఇక్కడి ప్రాంత ప్రజలతో పాటు ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకోవడం తోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆషాడ మాసం లో మహిళలు గోరింటాకు పెట్టుకునే ఆనవాయితీని కొనసాగిస్తూ వందలాది మంది మహిళలు ఆలయంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు మహిళాలు ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



- ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**కరీంనగర్, ఆగస్టు 3(సింగిడి):** ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సభామందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, రెవెన్యూ విభాగాధికారి షర్మిల, జిల్లా రెవెన్యూ అధికారి స్వామితో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా, అత్యధికంగా కరీంనగర్ రెవెన్యూ విభాగాధికారి కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులతో పాటు న్యాయస్థానాలకు సంబంధించిన కేసులను కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలి



- అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్
- ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు

**కరీంనగర్, ఆగస్టు 3(సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం కారణంగా కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వారు ఉన్నత విద్య, ఉద్యోగ దరఖాస్తుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో అమలు చేసిన విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, మెస్ చార్జీలను పెంచాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అండెం రమణారెడ్డి, దడిగల వెంకటేశ్వర్‌రావు, ల్యాగల వీరారెడ్డి, అంచూరి సదానందం, విక్రమ్ సింహారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలు సహకారం చేయాలి

### వోపా సేవలు అభినందనీయం
### మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట, ఆగస్టు 3 (సింగిడి):** విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడం తోపాటు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని స్థానిక వినాయక గార్డెన్స్ లో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వోపా హుజురాబాద్ నియోజకవర్గం సభ అధ్యక్షులు కట్ట నాగభూషణ చారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ ఎస్ఎస్సి ,ఇంటర్ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులతో పాటు పదో తరగతి లో ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని ఉన్నతమైన విద్యను అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో అగ్రస్థానంలో నిల బడతారని చదువు కు మించిన ఆస్తి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొని పురస్కారాలు అందించిన అనంతరం రాష్ట్ర వోఫాకన్వీనర్ వేములవాడ ద్రోణాచారి,కో కన్వీనర్ కట్ట విష్ణువర్ధన్ తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధి రాష్ట్ర కోశాధికారి కాసుల కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గద్దె సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ , 28వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేష్, 8వ వార్డు కౌన్సిలర్ సురేష్ ఉపాధ్యక్షులు వ్యాఖ్యాత మామిడోజు సదానంద చారి మాట్లాడుతూ వోపా విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు గుర్తించి పురస్కారాలు అందించడం మంచి శుభ సూచకం ఇలా చిన్న కుటుంబాల నుండి ఆణిముత్యాలను వెలికి తీసి ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించి వారు వచ్చే తరానికి దిక్సూచిగా నిలిచేందుకు ప్రోత్సహించి ముందుకు సాగేలా చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులు గుర్తించి ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ విజయగిరి తులసి దాస్ ,ఉపాధ్యక్షులు తాటికొండ భద్రాచారి,కోశాధికారి రంగు ప్రశాంత్ జూపాక శ్రీనివాస్ ఉమ్మడి సురాచారి, కటుకోజ్వల సదానందం, శ్రీరామోజు మహేంద్ర చారి, తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక నిఘా





**కోదాడ,ఆగస్టు 3(సింగిడి):** కోదాడ పట్టణ సీఐ శివశంకర్ నాయక్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా టీం ఆదివారం సాయంత్రం కోదాడ పట్టణ పరిధిలోని డేగ బాబు కళ్యాణ మండపం సమీపంలో నిందితుల నుండి 6 కేజీల గంజాయి 38 పార్టీల దగ్గు మందును స్వాధీనం చేసుకుంది.... డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం కోదాడ పట్టణానికి చెందిన పంది వినోద్ షేక్ మగ్దుంపాషా ఆవిడి రాఘవ లు, అనంతగిరి మండలానికి చెందిన రవితేజ షేక్ ఇర్ఫాన్లతోపాటు ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ సుభానిలను పట్టణ సీఐ నేతృత్వంలో ప్రత్యేక టీం దాడి నిర్వహించి నిందితులను పట్టుకొని వారి నుండి 6 కేజీల గంజాయి 38 దగ్గు మందు బాటిళ్లు ఒక ద్విచక్ర వాహనం రెండు మొబైల్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చేదించిన పట్టణ సీఐ శివశంకర్ నాయకులు ఎస్ఐ అజయ్ కుమార్ ఇతర పోలీసులకు రివార్డుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా
- హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి
- మానేరు పరివాహక ప్రాంతాల గ్రామాలలో కార్డెన్‌సెర్చ్





**జమ్మికుంట, ఆగస్టు 3 (సింగిడి):** జమ్మికుంట మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలైన విలాసాగర్ వావిలాల గంద్రపల్లి గ్రామాలలో సోమవారం ఉదయం హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కరీంనగర్ సిపి గౌస్ సలాం ఆదేశాల మేరకు హుజురాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో జమ్మికుంట మండలంలోని విలాసాగర్ వావిలాల గంద్రపల్లి గ్రామాలను కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. మండలంలోని వావిలాల ,గంద్రపల్లి విలాసాగర్ గ్రామాలలో డివిజన్ స్థాయి పోలీసులతో పాటు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రత్యేక పోలీస్ బలగాలతో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం సోమవారం ఉదయం వేళ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మూడు గ్రామాలలో ఉన్న అక్రమ ఇసుక నిలువలను పరిశీలించడం తోపాటు అనుమతి లేని 29 ద్విచక్ర వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసిపి మాధవి మాట్లాడుతూ గ్రామాలలో అక్రమ ఇసుక నిల్వలు ఉంచినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విలాసాగర్ గ్రామంలో అక్రమ ఇసుక నిలువలు ఎక్కువగా ఉన్నాయని , పలుమార్లు కేసులు చేసి జరిమానాలు విధించినప్పటికీ మార్పు రావడంలేదని ఇకనుండి రెండుసార్లు కేసులు అయినట్లయితే ట్రాక్టర్లను ఇవ్వడం జరగదని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలను కొత్త వ్యక్తుల సంచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు పోలీస్ శాఖకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ హుజురాబాద్ సిఐ కరుణాకర్ తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని పలువురు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది తొలగింపును విరమించుకోవాలి

18 మంది సిబ్బందికి విధుల కొనసాగింపు

15 నెలల పెండింగ్ వేతనాల విడుదల కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి



**కరీంనగర్, ఆగస్టు 3(సింగిడి):** కరీంనగర్ జిల్లాలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో 2018 నుంచి సేవలందిస్తున్న భూభారతి క్షేత్ర సాంకేతిక సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందిలో ఏడుగురిని విధుల నుంచి తొలగించే ప్రతిపాదనపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా భూ రికార్డుల నవీకరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, తహసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక సేవలు అందిస్తూ అనుభవాన్ని సంపాదించిన తమను పక్కనపెట్టి, ఆ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించేందుకు శిక్షణ ఇస్తున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల తొలగింపు అమలైతే తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అలాగే గత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా భూ సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమను విధుల నుంచి తొలగించే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, 18 మంది క్షేత్ర సాంకేతిక సిబ్బందిని యథావిధిగా కొనసాగిస్తూ, పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, జిల్లా యంత్రాంగాన్ని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

## భవిష్యత్ తరాల కోసం భూగర్భజలాలు పెంచాలి

### సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (సింగిడి):** భవిష్యత్ తరాలకు నీటినిల్వలు అందించాలంటే భూగర్భ జలా లను పెంచాలని పెద్దమందడి మండలం మనిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ కోరారు. సోమవారం గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి ఊరికి ఊట కుంట అనే నినాదంతో సామాజిక ఇంకుడు గుంతలకు సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ శ్రీకారం చుట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతిష్టాత్మ కంగా నీటి నిలువలు, భూగర్భ జలాలు పెరగడానికి అవసరాలకు ఉపయోగించుకున్న నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతల్లో వదలాలని అన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో నీటి నిల్వలు పెరుగుతాయని, ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి దగ్గర ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఉప సర్పంచ్ ముప్పూరి గణేష్, పాఠశాల హెచ్ ఎం వెంకటేష్, గ్రామస్తులు సంచార మౌని రాములు, రాంరెడ్డి, ప్రతాప్ రెడ్డి, బాలరాజు, వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి, కోములయ్య, రాములు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో వెలమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

### నూతనంగా ఎన్నికైన వెలమ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



**జమ్మికుంట ఆగస్టు 3 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో సోమవారం మండలంలోని వెలమ కులస్తుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు, యువకులు, ప్రజాప్రతినిధులు హాజరై పరస్పరం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా విజయం సాధించి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మడికొండ సురేందర్‌రావు, పోల్సాని వేణురావు, పోల్నేని వేణురావులను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మడికొండ సురేందర్ రావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, యువతలో ఐక్యత, విద్య, ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వెలమ కులస్తుల మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను తరచూ నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

వాకర్ల సంక్షేమం, మెరుగైన సౌకర్యాలే ప్రధాన లక్ష్యమని నూతన కమిటీ సంకల్పం



**కరీంనగర్, ఆగస్టు3 (సింగిడి):** డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ బలోపేతం, వాకర్ల ఆరోగ్య చైతన్యం పెంపు, స్టేడియంలో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం సమిష్టిగా కృషి చేయాలని నూతన కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. నూతన అధ్యక్షుడిగా కేంసారం, ప్రధాన కార్యదర్శిగా పూసాల సంపత్, కోశాధికారిగా వోల్లాల శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసరి అశోక్, కుమార్ మహర్షి, సంపత్, కర్ర సత్యం, పెద్ది శ్రీనివాస్, మిరియాల శ్రీధర్ రెడ్డి, తోట శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా నాగవెల్లి ప్రతాప్ రెడ్డి, పొన్నం రాజు గౌడ్, తోడుపునూరి శ్రీనివాస్ ఎన్నిక కాగా, గౌరవాధ్యక్షులుగా కన్నం శ్రీనివాస్, చాడ రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. గౌరవ సలహాదారులుగా తిరుపురం సత్తయ్య, పెంచాల కిషన్ రావు, తోట శ్రీనివాస్, మిర్యాల శ్రీధర్ రెడ్డి, తోడుపునూరి శ్రీనివాస్, గుంటపల్లి స్వామి, జంగళ్లపల్లి కుమార్, నిర్వహణ కార్యదర్శులుగా చెన్నడి రవీందర్ రెడ్డి, బురగోని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

- బిజెపి ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం



**జమ్మికుంట, ఆగస్టు 3 (సింగిడి):** జమ్మికుంట బిజెపి పార్టీ, యువ మోర్చ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బిజెపి లడాయి కార్యక్రమాన్ని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, యువ మోర్చ అధ్యక్షులు తుర్పాటి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా యువ మోర్చ జిల్లా అధ్యక్షులు సంగ నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులతో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం నిధులు అందించక చాలా మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ లొ ఉన్న 15 వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ఇడియట్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం సిగ్గు చేటు అని వెంటనే విద్యార్థులకు సిఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట గాంధీ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, కైలాసకొటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, అడువాల శ్రీధర్, శ్రీవర్తి ప్రవీణ్, గట్టు సాయిరాం, ప్రణిత్, పసునూటి శివ, పనికారి రమేష్, పొడెటి అనిల్, సిరియాల విజయ్, కొలకాని అరవింద్, చందా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలో పారిశుధ్య కార్మికులను కొనసాగించాలని గ్రామస్తుల తీర్మానం

**మహాముత్తారం, ఆగస్టు 3 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న బొబ్బిలి సారక్క, బొజ్జ లక్ష్మీనారాయణలను విధుల నుంచి తొలగించవద్దని గ్రామస్తులు గ్రామసభలో కోరారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వక వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామసభకు హాజరైన 41 మంది సభ్యుల్లో 29 మంది గ్రామస్తులు పారిశుధ్య కార్మికులను కొనసాగించాలని సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. గ్రామ ప్రజల మెజార్టీ అభిప్రాయాన్ని గౌరవించి వారిని విధుల్లో కొనసాగించేలా తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల గ్రామపంచాయతీ పాలకవర్గం పలు కారణాలను పేర్కొంటూ వారిని తొలగించాలని చేసిన తీర్మానాన్ని పునఃపరిశీలించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో పారిశుధ్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్మికులనే కొనసాగించాలని తమ వినతిపత్రంలో పేర్కొన్నారు.



# విలువలు గల నేతృత్వం... డెడికేషనే 'పింగిళి' నైజం

- పదవులు మారినా మారని ఆయన నైజం
- కార్మిక--కర్షక సంక్షేమధ్యేయమే...
- రాజకీయాలకు అసలైన అర్థమని ప్రూవ్ చేసిన నేత



రాజకీయాల్లో పదవులు రావడం పెద్ద విషయం కాదు... ఆ పదవుల్లో ప్రజల గౌరవాన్ని నిలబెట్టుకోవడమే అసలు సవాలు. పాతికేళ్లకు పైగా ప్రజాజీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వహించినా అవినీతి ఆరోపణలకు తావివ్వకుండా, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్న నాయకుడు కరీంనగర్ డీసీసీబీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిళి రమేశ్. కార్మికుల హక్కుల నుంచి రైతుల సంక్షేమం వరకు ప్రతి అంశాన్ని తన బాధ్యతగా భావిస్తూ ప్రజాసేవనే రాజకీయాల లక్ష్యంగా మలుచుకున్న ఆయన జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం.

– జమ్మికుంట, ఆగస్టు 3 (సింగిడి)

### ప్రజల మధ్యే రాజకీయాల ఆరంభం

దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ప్రోత్సాహంతో ప్రజా జీవితంలో అడుగుపెట్టిన పింగిళి రమేశ్, మొదటి నుంచీ హంగు ఆర్భాటాలకు దూరంగా ప్రజల మధ్యే తన రాజకీయ ప్రయాణాన్ని నిర్మించుకున్నారు. పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే ఆయనకు అన్ని వర్గాల్లో ప్రత్యేక ఆదరణ లభించింది.

### కార్మిక ఉద్యమాలే రాజకీయ పునాది

పింగిళి రమేశ్ రాజకీయ జీవితానికి కార్మిక ఉద్యమాలే బలమైన పునాది. హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా, హుజూరాబాద్ ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా వేలాది మంది కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. జమ్మికుంటలో ప్రతి మేడే సందర్భంగా నిర్వహించే భారీ కార్మిక ర్యాలీలకు నాయకత్వం వహిస్తూ కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు.



### సేవా కార్యక్రమాల్లో దంపతుల పాత్ర

రాజకీయాలతో పాటు సామాజిక సేవలోనూ పింగిళి కుటుంబం ముందుంటోంది. మాజీ సర్పంచ్ రమాదేవి ఆధ్వర్యంలో 'బంగారు తల్లి' పేరిట బాలికల విద్య, అవసరాల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సేవకుడిగా పనిచేసిన తన తండ్రి నుంచి వచ్చిన సేవా స్ఫూర్తినే ప్రజా జీవితంలో కొనసాగిస్తున్నానని పింగిళి రమేశ్ తరచూ చెబుతుంటారు.





### రైతు ప్రయోజనాలే పరమావధి

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో రైతులకు న్యాయం చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా పత్తి కొనుగోళ్లలో 'తరుగు' విధానాన్ని తొలగించడం ద్వారా రైతులకు కోట్ల రూపాయల మేర లాభం చేకూరిందని స్థానికులు గుర్తు చేసుకుంటారు. అదే నిర్ణయం తన ప్రజాజీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిందని రమేశ్ కూడా చెబుతుంటారు.

### సహకార రంగంలోనూ విశ్వాసానికి ప్రతీక

ఇల్లందకుంట సింగిల్ విండో చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నికతో ప్రారంభమైన సహకార రంగ ప్రస్థానం, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్, ప్రస్తుతం డీసీసీబీ వైస్ చైర్మన్ పదవి వరకు కొనసాగింది. రైతులకు సహకార వ్యవస్థను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారని సహచరులు పేర్కొంటున్నారు.

### పదవుల కంటే ప్రజల ప్రేమే పెద్దది

2001లో విలాసాగర్ గ్రామ సర్పంచ్‌గా ప్రారంభమైన ప్రజాప్రస్థానం నేటికీ అదే నిబద్ధతతో కొనసాగుతోంది. 2010లో గులాబీ పార్టీలో చేరిన తర్వాత పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే, రాజకీయాలకు అతీతంగా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. కార్మికులు, రైతులు, వ్యాపార వేత్తలు, సాధారణ ప్రజలు అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా పేరు సంపాదించారు.

### 'అజాతశత్రువు'గా ప్రత్యేక గుర్తింపు

దీర్ఘకాల ప్రజాజీవితంలో ప్రత్యర్థులను కూడా వ్యక్తిగత శత్రువులుగా చూడకుండా, అందరితో ఆప్యాయంగా మెలగడం పింగిళి రమేశ్ వ్యక్తిత్వానికి నిదర్శనంగా చెప్పబడుతోంది. అందుకే ఆయనను అనుచరులు మాత్రమే కాదు, వివిధ వర్గాల ప్రజలు కూడా 'అజాతశత్రువు', 'శ్రామిక మిత్రుడు', 'ప్రజల ఆత్మబంధువు'లిగా అభివర్ణిస్తుంటారు.

### 'ప్రజల విశ్వాసమే నా బలం'

ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద ఆస్తి అని పింగిళి రమేశ్ చెబుతున్నారు. తొలి అవకాశం ఇచ్చిన విలాసాగర్ గ్రామ ప్రజలతో పాటు కార్మికులు, రైతులు, వ్యాపారవర్గాలు చూపిన ప్రేమాభిమానాలను జీవితాంతం మరవనని పేర్కొంటున్నారు. భవిష్యత్తులోనూ ప్రజల సంక్షేమం కోసం అదే అంకితభావంతో పనిచేయడమే తన లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు.

# మిషన్ భగీరథలో కాంట్రాక్టర్ల దోపిడీపై ప్రజావాణిలో ఫిర్యాదు

- 60--80 మంది ఉండాల్సిన చోట 16 మందితోనే నిర్వహణ
- కార్మిక హక్కుల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు3 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోనంపేట మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణలో కాంట్రాక్టర్ అక్రమాలు, కార్మికుల శ్రమదోపిడీ, అలవెన్సుల దుర్వినియోగం జరుగుతున్నాయని ఆరోపిస్తూ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేసింది. జులై 27న ఇదే అంశంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ గానీ, చర్యలు గానీ చేపట్టలేదని పేర్కొంటూ ఈసారి రిమైండర్ లేఖ సమర్పించినట్లు పీక కిరణ్ తెలిపారు. కోనంపేట ప్లాంట్ ద్వారా మహాముత్తారం సహా ఆరు మండలాల పరిధిలోని వందలాది గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోందని, నిబంధనల ప్రకారం 60 నుంచి 80 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 16 మందితోనే ప్లాంట్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్మికులపై అధిక పనిభారం పడటమే కాకుండా ఆదివారాలు, పండుగ సెలవులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కార్మికుల జీతాల నుంచి మెడిక్లెయిమ్, పెట్రోల్ అలవెన్సుల పేరుతో నెలకు రూ. 8 వేల నుంచి రూ. 12 వేల వరకు అక్రమంగా కోతలు విధిస్తున్నారని, లేని ఉద్యోగులను రికార్డుల్లో చూపిస్తూ బిల్లులు పొందుతున్నారని, సూపర్‌వైజర్ పోస్టుల పేరిట భారీ మొత్తంలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని జేఏసీ ఆరోపించింది. అలాగే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లేఖలు, ఐడీ కార్డులు, పే స్లిప్పులు కూడా ఇవ్వడం లేదని తెలిపింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కార్మికులకు బకాయి అలవెన్సులు, ఓవర్‌టైమ్ బకాయిలను చెల్లించాలని, ఖాళీ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమస్య తీవ్రతను పరిశీలించి మిషన్ భగీరథ, కార్మిక శాఖ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.


# జావెలిన్‌త్రోలో పతకాలు సాధించిన మదర్స్ ల్యాప్



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (సింగిడి):** వనపర్తి జిల్లా కేంద్రంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ జాతీయ జావిలిన్ త్రో డే సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హై స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాలలో విజయాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు వనపర్తి టౌన్ సిఐ రత్నం అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. విద్యార్థుల విజయం పట్ల మదర్స్ ల్యాప్ హై స్కూల్ ప్రిన్సిపల్ అబ్దుల్ ముబిన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అబ్దుల్ ముబిన్ మాట్లాడుతూ 2021 టోక్యోలో జరిగిన ఒలంపిక్స్ క్రీడల్లో భారతదేశ అథ్లెటిక్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి మన దేశానికి కీర్తి సాధించారని, ఆయన బంగారు పథకం సాధించిన ఆగస్టు 7న జాతీయ జావెలిన్ త్రో డే ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారని చెప్పారు. దేశంలోనే యువతను, చిన్నపిల్లలను అథ్లెటిక్స్, జావిలిన్ త్రో క్రీడల వైపు ఆకర్షించడానికి, ప్రతిభ చాటడానికి దేశవ్యాప్తంగా జిల్లాల పరిధిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

## సమన్వయం లేకుండా స్వంత నిర్ణయాలు చేస్తున్నారని ఆరోపణ


Citizen Copy
GOVERNMENT OF TELANGANA
Suryapet District Prajavani Acknowledgment
DSRPT03082600063
Grievance Date:
M Venkateswarlu
Mobile No.:
...has been forwarded to the Suryapet Dist. Panchayat Office - Sur...
Kindly note the Grievance ID for further reference.

**మోతె, ఆగస్టు 3 (సింగిడి):** మండలంలోని ఉర్లుగొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి తీరుపై గ్రామ సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిపాలనలో సర్పంచ్‌తో సమన్వయం లేకుండా కార్యదర్శి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. సర్పంచ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ కోసం పనిచేస్తున్న కార్మికులు నలుగురు తమ పనులను రోజువారీగా పంచుకుని నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురు కార్మికులపైనే అధిక పనిభారం పడుతోందని సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా, సమస్యను పరిష్కరించాల్సిన చోట తనకు సహకారంగా ఒక వ్యక్తి పనిచేయాలని చెప్పడంతో వివాదం తలెత్తిందన్నారు. గ్రామ పంచాయతీ పాలనలో ప్రజాప్రతినిధి, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా, కార్యదర్శి వ్యవహారశైలి అందుకు విరుద్ధంగా ఉందని సర్పంచ్ ఆరోపిం చారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్య పనులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# శిశువులకు తొలి రక్షణ తల్లిపాలే..

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవి



**హనుమకొండ, ఆగస్టు 3 (సింగిడి):** శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ప్రతి తల్లి తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, శిశువులకు సమయానుకూలంగా తల్లిపాలు అందించాలని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండ గోపాల్‌పూర్‌లోని ఎంపీపీఎస్ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాశన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగాచిన్నారులకు తన చేతుల మీదుగా అన్నప్రాశనం చేయించి ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించేఅమూల్యమైన ఆహారమని పేర్కొన్నారు. శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని, ఆ తరువాత ఏడో నెల నుంచి వైద్యుల సూచనల మేరకు అనుబంధ పోషకాహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. పిల్లల తల్లులు తమ ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన తల్లే ఆరోగ్యవంతమైన బిడ్డకు పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌పూర్ ఆరోగ్య కేంద్రం--1 పరిధిలోని చిన్నారులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అంగన్‌వాడీ సూపర్వైజర్లు జ్యోతి, ఝాన్సీ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రీతి, జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సమత, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన సదస్సు



**హనుమకొండ, జూలై 3 (సింగిడి):** వరంగల్ కమిషనరేట్ పరిధిలో నీ పోలీసు అధికారులకు సైబర్ క్రైమ్ అంశాలపై ప్రత్యేక అవగాహన సోమవారం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ సూచనలతో, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ ఆధ్వర్యంలో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్ ), వరంగల్ కళాశాలలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్ హెచ్ ఓ) ఇతర పోలీసు అధికారుల కోసం ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో సైబర్ నేరాల దర్యాప్తుకు సంబంధించిన వివిధ దర్యాప్తు పద్ధతులు, ఆర్థిక సైబర్ నేరాల విచారణ, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, అలాగే వివిధ సైబర్ పోర్టల్ల వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా, సైబర్ నేరాల నివారణ, "గోల్డెన్ అవర్"లో తక్షణ స్పందన, బాధితులకు సత్వర న్యాయం అందించడం, అంతర్రాష్ట్ర సమన్వయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి సైబర్ నేరాలను దర్యాప్తు చేయడం, నేరస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టే విధానాలపై అధికారులు సవివరంగా వివరించారు.

# పొలంలో నాట్లు వేసి విద్యార్థులకు పాఠాలు

అన్నం తయారయ్యే చోటును చూపిన ఉపాధ్యాయుడు

వెంకటాపురం మండలం మరికాల కొత్తూరులో వినూత్న కార్యక్రమం







**ములుగు ప్రతినిధి, ఆగస్టు 3 (సింగిడి):** సెల్‌ఫోన్, టీవీల మధ్య పెరుగుతున్న నేటి తరానికి వ్యవసాయం అంటే ఏమిటో, రైతు కష్టం ఎంతుందో తెలియజేయాలనే సంకల్పంతో ఓ ఉపాధ్యాయుడు తరగతి గదిని వదిలి పొలంలోకి వచ్చారు. పిల్లల చేతులతోనే వరి నాట్లు వేయించి "అన్నం దొరికే చోటు"ను ప్రత్యక్షంగా చూపించారు. వెంకటాపురం మండలం మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కాపుల విజయ్ ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులందరినీ సమీపంలోని వరి పొలానికి తీసుకెళ్లారు. అక్కడ స్థానిక రైతుల సహకారంతో విద్యార్థులకు వరి సాగులోని ప్రతి అంశాన్ని ఆచర ణాత్మకంగా నేర్పించారు. ముందుగా నారు ఎలా పెంచుతారో, పొలాన్ని ఎలా దున్ని సిద్ధం చేస్తారో వివరించారు. ఆ తర్వాత విద్యార్థుల చేతులతోనే వరి నాట్లు వేయించారు. బురదలోకి దిగిన పిల్లలు మొదట్లో భయపడినా, కాసేపటికే ఉత్సాహంగా నాట్లు వేయడం ప్రారంభించారు. నాట్లు వేసిన తర్వాత పంటకు నీరు ఎలా పెట్టాలి, కలుపు ఎలా తీయాలి, తెగుళ్ల నుంచి ఎలా కాపాడాలి, ఎరువులు ఎప్పుడు వేయాలి, చివరకు పంటను ఎలా కోత కోయాలనే విషయాలను సులభమైన భాషలో విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పారు. పాఠ్యపుస్తకంలో చదివే దానికంటే కళ్ల ముందు చూడటం వల్ల విషయం త్వరగా మనసులో నాటుకుంటుంది. వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు, అది ఒక జీవన విధానం" అని విజయ్ సార్ విద్యార్థులకు తెలియజేశారు. బురదలో గంట సేపు పనిచేసిన తర్వాత రైతు ఎంత కష్టపడతాడో విద్యార్థులకు అర్థమైంది. "సార్ కాళ్లు నొప్పులు వస్తున్నాయి, కానీ రైతులు రోజంతా ఇలాగే పని చేస్తారా" అని ఒక విద్యార్థి అడిగిన ప్రశ్న అందరినీ ఆలోచింపజేసింది. ఈ అనుభవంతో విద్యార్థుల్లో అన్నం వృథా చేయకూడదనే భావం, రైతు పట్ల గౌరవం పెరిగింది. ఈ సందర్భంగా కాపుల విజయ్ మాట్లాడుతూ, "నేటి తరం పిల్లలకు వ్యవసాయం అంటే తెలియడం లేదు. అన్నం ప్లేట్‌లోకి ఎలా వస్తుందో తెలియదు. దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు తెలియ జేయాలి. విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు, ప్రకృతి పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల అవగాహన పెంపొం దించడం కూడా పాఠశాలల బాధ్యత" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు, రైతులు, తల్లి దండ్రులు అభినందించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి అనుభవాత్మక బోధన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. దీనివల్ల పిల్లల్లో వ్యవసాయం పట్ల చైతన్యం, శ్రమకు గౌరవం, ప్రకృతి పరిరక్షణపై బాధ్యత పెరుగు తుంది" అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలిచిందని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాలని కోరారు.


# తల్లిపాలలో ఎంతో ఆరోగ్యం దాగి ఉంది

## ఎమ్మెల్సీ శంకర్ నాయక్




**మిర్యాలగూడ ఆగస్టు 3 (సింగిడి):** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లి పాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి అవగాహనా కల్పించాలని ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్, ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ లు కోరారు. సోమవారం స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 7వరకు జరిగే తల్లి పాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్, దామరచర్ల ప్రాజెక్టుపరిధిలోని అన్ని అంగన్వాడీల్లో ఈ మేరకు గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని వారు కోరారు. పిల్లలకు తల్లి పాలు ఇవ్వడంవల్లపిల్లలు,తల్లులుఆరోగ్యావంతులవుతారని వారన్నారు. వారం వరకు అవగాహన కార్యక్రమం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి దామరచర్ల, అనుముల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్లు శాంతి, విజయలక్ష్మి, మిర్యాలగూడ ప్రాజెక్టు సూపర్ వైజర్ కె. నాగమణి, అనుముల సూపర్వైజర్ ఫరీదా బెగం మాధవి తదితరులు పాల్గొన్నారు.

# లక్కవరంలో మహిళా సంఘం కార్యాలయ భవనానికి శంకుస్థాపన



**కోదాడ,ఆగస్టు 3 (సింగిడి):** అనంతగిరి మండలంలోని లక్కవరం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య సంఘం కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఏపీఎం సౌజన్యతో కలిసి సర్పంచ్ ఆళ్ల నవ్య సురేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధికి, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నరసింహారెడ్డి, షేక్ నాగుల్ మీరా, కార్యదర్శి త్రివేణి, కూరపాటి భూపతి, సంఘ బంధం అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కరాటే పోటీల్లో కిట్స్ విద్యార్థినికి బంగారు పతకం




**కోదాడ,ఆగస్టు 3 (సింగిడి):** ఖమ్మంలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఎం. అంజలి ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. కళాశాలలో బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఈఈఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న అంజలి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ విద్యార్థినిని అభినందిస్తూ, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించ డం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్లపల్లి గాంధీ, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ శివాజీ, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, కరాటే శిక్షకురాలు మాధవీలత విద్యార్థినిని అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

# మామిడి తొక్కలను పారేస్తున్నారా?

సాధారణంగా మనం మామిడి పండ్లను తినేటప్పుడు వాటి తొక్కలను పారేస్తుంటాం. కానీ, జీరో వేస్ట్ జీవనశైలిలో భాగంగా మామిడి తొక్కల వల్ల అనేక ఆరోగ్య, చర్మ ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మామిడి తొక్కల విశిష్ట ఉపయోగాల గురించి పూర్తిగా తెలుసుకుందాం.





## పోషకాల గని- మామిడి తొక్క:

మామిడికాయ తొక్కల్లో విటమిన్ ఎ, విటమిన్ సి, ఫైబర్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి, ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షించడానికి ఎంతో సహాయపడతాయి. ఇందులో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది.

**చర్మ సౌందర్యానికి రక్షణగా:**

మామిడి తొక్కలు చర్మ సంరక్షణలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు, వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. మామిడి తొక్కలను ఎండబెట్టి, పొడి చేసి, దానికి కొద్దిగా తేనె లేదా పెరుగు కలిపి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవచ్చు. ఇది చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. మొటిమలను తగ్గిస్తుంది.

**మామిడి తొక్కల పొడి**

తొక్కలను బాగా కడిగి, ఎండబెట్టి పొడిలా చేసుకోవాలి. ఈ పొడిని ఉదయం పూట స్మూతీస్, జ్యూస్‌లు లేదా సూప్‌లలో ఒక చెంచా కలుపుకుని తాగడం వల్ల శరీరానికి మంచి ఫైబర్ అందుతుంది. ఇది బరువు తగ్గాలనుకునే వారికి ఎంతో మేలు చేస్తుంది.

**మామిడి తొక్కల టీ**

తాజా మామిడి తొక్కలను నీటిలో వేసి బాగా మరిగించి, వడకట్టి, కొద్దిగా నిమ్మరసం లేదా తేనె కలుపుకుని హెర్బల్ టీలా తాగవచ్చు. ఇది శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపడానికి సహాయపడుతుంది. కొన్ని రకాల సాంప్రదాయ పచ్చళ్ళు, చట్నీలు లేదా కూరలలో మామిడి తొక్కలను తురిమి వేయడం ద్వారా వంటకానికి ప్రత్యేకమైన రుచి, పోషకాలు తోడవుతాయి.





మామిడి తొక్కలను ఉపయోగించే ముందు వాటిని ఉప్పు నీటితో లేదా బేకింగ్ సోడా నీటితో బాగా కడగడం చాలా ముఖ్యం. దీనివల్ల వాటిపై ఉండే పురుగుమందుల అవశేషాలు తొలగిపోతాయి. ప్రకృతి మనకు ఇచ్చిన ప్రతి వస్తువులోనూ ఏదో ఒక ప్రయోజనం దాగి ఉంటుంది. కాబట్టి, ఇకపై మామిడి తొక్కలను వృథాగా పారేయకుండా, పైన పేర్కొన్న పద్ధతులలో ఉపయోగించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోండి.



### రాత్రి భోజనం మానేసి

# నిద్రపోతే బరువు తగ్గరు..

### కానీ ఈ రోగాలు మాత్రం వస్తాయి

చాలామంది పని ఒత్తిడి, అలసట, బరువు తగ్గాలనే ఉద్దేశంతో రాత్రి భోజనం చేయకుండా నిద్రపోతుంటారు. కొందరికి ఇది ఆరోగ్యకరమైన అలవాటుగా అనిపించినా, నిపుణుల అభిప్రాయం మాత్రం భిన్నంగా ఉంది. రాత్రిపూట పూర్తిగా ఆకలితో పడుకోవడం శరీరంపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.





**ఎసిడిటీ, గుండెల్లో మంట సమస్యలు**

ఎక్కువసేపు కడుపు ఖాళీగా ఉండటం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా ఎసిడిటీ, గుండెల్లో మంట, కడుపులో మంట, గ్యాస్ట్రైటిస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఉదయం నిద్రలేచిన తర్వాత తలనొప్పి, వికారం, బలహీనత వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు.

**నిద్ర నాణ్యత తగ్గే అవకాశం**

ఆకలిగా ఉండటం వల్ల రాత్రి గాఢ నిద్ర పట్టకపోవచ్చు. తరచూ మెలకువ రావడం, అర్ధరాత్రి ఆకలి వేయడం, ఉదయం అలసటగా లేవడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. మంచి నిద్ర కోసం తేలికపాటి ఆహారం తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**పోషకాహార లోపం వచ్చే ప్రమాదం**

రాత్రి భోజనం మానేయడం వల్ల శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు సరైన మోతాదులో అందకపోవచ్చు. దీని వల్ల కండరాల బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం, తరచూ అలసటగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తవచ్చు.

**జీవక్రియపై ప్రభావం**

తరచుగా భోజనం మానేయడం వల్ల శరీర జీవక్రియ (మెటాబాలిజం) దెబ్బతినే అవకాశం ఉంది. ఇన్సులిన్ స్థాయిల్లో అసమతుల్యత ఏర్పడి, హార్మోన్ల పనితీరు ప్రభావితమవుతుంది. దీర్ఘకాలంలో ఇది పలు ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు.

**రాత్రిపూట ఏమి తినాలి?**

ఖాళీ కడుపుతో నిద్రపోవడం కంటే తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది. కూరగాయల సూప్, ఓట్‌మీల్, పండ్లు, పెరుగు, తక్కువ పరిమాణంలో చపాతీలు లేదా శనగపిండి గంజి వంటి ఆహారాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.



# ఏఎస్ఎఫ్ బీబీక్యూ అండ్ గ్రిల్ వార్షికోత్సవ వేడుకలు







**హైదరాబాద్ :** భారతదేశంలో తొలి లావా స్టోన్ గ్రిల్ బఫే రెస్టారెంట్ అయిన ఏఎస్ఎఫ్ బీబీక్యూ అండ్ గ్రిల్ తన మూడో వార్షికోత్సవాన్ని "ది లావా లెగసీ – ఇయర్ 3" పేరుతో ఘనంగా నిర్వహించింది. 2023లో ప్రారంభమైన ఈ సంస్థ వినూత్న లావా స్టోన్ గ్రిల్ కాన్సెప్ట్‌తో హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. వేడుకల సందర్భంగా అనాథ చిన్నారులతో ప్రత్యేకంగా సమయం గడిపిన సంస్థ ప్రతినిధులు వారికి భోజనం ఏర్పాటు చేయడంతో పాటు స్కూల్ బ్యాగులు, అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహిం చిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అదేవిధంగా ఉద్యోగుల సత్కారం, వినోద కార్యక్రమాలు, ప్రత్యేక డైనింగ్ అనుభవాలు నిర్వహించారు. సంస్థ విజయానికి తోడ్పడిన విని యోగదారులు, ఉద్యోగులు, వ్యాపార భాగస్వాము లకు కృతజ్ఞతలు తెలుపుతూ యాజమాన్యం ముందుకు సాగుతున్నట్లు పేర్కొంది. నాణ్యత, ఆవిష్కరణ, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని వినూత్న డైనింగ్ అనుభవాలను అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

# అయ్యో.. పొరపాటు జరిగింది..

### 8,000 మందిని తొలగించిన తర్వాత మార్క్ జుకర్‌బర్గ్ స్పందన!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో ప్రపంచవ్యాప్తంగా పోటీ మరింత తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ప్రముఖ టెక్ దిగ్గజాలు తమ వ్యాపార వ్యూహాలను మార్చుకుంటున్నాయి.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృసంస్థ అయిన మెటా సైతం AI ఆధారిత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారీ పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కంపెనీ వేలాది మంది ఉద్యోగులను తొలగించడం ప్రపంచ టెక్ రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ప్రారంభంలో మెటా సంస్థ తన AI వ్యూహాన్ని వేగవంతం చేయడానికి ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి చివరి నాటికి కంపెనీలో సుమారు 78,000 మంది ఉద్యోగులు ఉండగా, మే నెలలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మందిని, అంటే సుమారు 8,000 మందిని తొలగించింది. అదే సమయంలో మరో 7,000 మంది ఉద్యోగులను ౹ా×-సంబంధిత ప్రాజెక్టులు, సాంకేతిక విభాగాలు, కొత్త బాధ్యతలకు బదిలీ చేసింది.




అయితే ఈ ప్రక్రియ పూర్తిగా విజయవంతం కాలేదని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. ఉద్యోగులను ఉద్దేశించి అంతర్గత లేఖ ఒకటి లభించినట్లు రాయిటర్స్ పేర్కొంది. దీని ప్రకారం ఆయన AI పరివర్తన ప్రక్రియలో కొన్ని తప్పులు జరిగాయని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా కంపెనీ తనను తాను మార్చుకుంటోందని, ఈ క్రమంలో భవిష్యత్తులో కూడా కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక టెక్ సంస్థలు AI ఆధారిత వ్యవస్థలను తమ కార్యకలాపాల్లో భాగం చేస్తున్నాయి. మెటా కూడా అదే దిశగా అడుగులు వేస్తోంది. గతంలో ఉద్యోగులు నిర్వహించిన కొన్ని పనులను AI ఏజెంట్ల ద్వారా నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తోంది. దీనివల్ల ఉత్పాదకత పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని కంపెనీ భావిస్తోంది.

ఈ భారీ మార్పుల నేపథ్యంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఏడాదిలో ఇకపై ఉద్యోగుల తొలగింపులు ఉండవని జుకర్‌బర్గ్ ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. అయినప్పటికీ, AI విప్లవం కారణంగా టెక్నాలజీ రంగంలో సంభవిస్తున్న మార్పులు ఏ ఒక్క కంపెనీ నియంత్రణలో ఉండవని ఆయన స్పష్టం చేశారు.

AI యుగంలో పోటీతత్వాన్ని నిలబెట్టుకోవడానికి మెటా చేపడుతున్న ఈ చర్యలు భవిష్యత్తులో టెక్ పరిశ్రమలో ఉద్యోగాల స్వరూపాన్ని మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు కొత్త అవకాశాలు సృష్టిస్తూనే, మరోవైపు సంప్రదాయ ఉద్యోగాలపై ఒత్తిడి పెంచుతున్న AI ప్రభావం టెక్ రంగ భవిష్యత్తును నిర్ణయించనుంది.

# భారీ లాభాల్లో ముగిసిన సూచీలు..


### సెన్సెక్స్ +736, నిఫ్టీ +231

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ శాంతి ఒప్పందంపై అమెరికా-ఇరాన్ ప్రకటన చేసిన నేపథ్యంలో చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకోనుండ దంతో ప్రపంచ మార్కెట్‌లూ ఊపిరి పీల్చుకున్నాయి. దాదాపు 4 నెలల ఉద్రిక్తతలకు శుభం కార్డు పడడంతో దలాల్ స్ట్రీట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా లాభపడగా.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో 700 పాయింట్ల లాభంతో సరిపెట్టుకుంది. నిఫ్టీ 23,850 పాయింట్ల ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 76,725.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,527.95) లాభాల్లో ప్రారంభమైంది.

ఇంట్రాడేలో 76,821.07 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 736.38 పాయింట్ల లాభంతో 76,264.33 వద్ద ముగిసింది. నిఫ్టీ 231 పాయింట్ల లాభంతో 23,853.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటర్నల్ షేర్లు లాభపడ్డాయి. ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4338 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు సైతం లాభాలతో ప్రారంభమయ్యాయి.

### రూ.5..6 వేల కోట్ల

# ఐపీఓకు రేజర్‌పే రెడీ





ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ రేజర్‌పే తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ రూట్‌లో సెబీకి దరఖాస్తు చేసినట్లు సమాచారం. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.5-6 వేల కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ప్రీ ఫైల్డ్ ముసాయిదా పత్రాలను సెబీకి, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీ ఫైల్ చేసినట్లు తెలుస్తోంది. ఐపీఓ ద్వారా ఎంత సమీకరించేదీ కంపెనీ అధికారికంగా ఇంకా వెల్లడించలేదు.

2014లో హర్షిల్ మాథుర్, శశాంక్ కుమార్ రేజర్‌పేను నెలకొల్పారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ పేమెంట్ సేవలను ఈ కంపెనీ అందిస్తోంది. మరోవైపు, ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కూడా ఐపీఓకు రానుంది. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా తన పబ్లిక్ ఇష్యూను వాయిదా వేస్తూ వస్తోంది. 1.5 బిలియన్ డాలర్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించే అవకాశం ఉంది. ఈక్రమంలోనే రేజర్‌పే ఐపీఓకు వస్తుండటం గమనార్హం. పోటీదారులకు మేలు చేకూర్చే సున్నిత సమాచారమేదీ బయటకు రాకుండా కంపెనీలు ఈ కాన్ఫిడెన్షియల్ రూట్‌ను ఎంచుకుంటూ ఉంటాయి. సెబీ అనుమతి పొందేవరకు ఆ వివరాలేవీ పబ్లిక్ డొమైన్‌లోకి రావు.

## స్టాక్ మార్కెట్

Stock Market

### తెలుగు విశ్వవిద్యాలయంలో నిరుద్యోగులు నిరసన



**హైదరాబాద్ బ్యూరో, జూన్ 15 (నినాదం):** తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో తెలంగాణాలో అన్ని శాఖల్లో గల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనీ బాచుపల్లి లోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిరుద్యోగులు నిరసన తెలిపారు .చిన్న చిన్న నోటిఫికేషన్స్ కాకుండా ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలను హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు .ప్రభుత్వం పోలీస్ ఉద్యోగాలను 19 వేలు భర్తీ చేయాలి అలాగే వయోపరిమితిని పెంచాలి .గ్రూప్స్ 1,2,3 కలిపి 10 వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలి. ఈ నిరసనలో విద్యార్థి వేదిక సభ్యులు కోట్ల అఖిల్ సాగర్ ,సోమయ్య, దేవీసింగ్ రాథోడ్ ,విజయ్ ,వీరాంజనేయులు,నవీన్, కళ్యాణ్,కపిల్ మొదలగు వారు పాల్గొన్నారు .

# మారుతీ సుజుకీ స్మార్ట్ మెయింటెయినెన్స్ ప్లాన్

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ 'స్మార్ట్ మెయింటెయినెన్స్ ప్లాన్' (SMP) తీసుకొచ్చింది. వాహన కొనుగోలు అనంతర సేవల కోసం కాల వ్యవధి ఆధారిత ప్రీపెయిడ్ సర్వీస్ ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది.




కస్టమర్లు దీన్ని వినియోగించుకోవచ్చు. ఎస్ఎంపీలో భాగంగా లేబర్ ఓన్లీ, పార్ట్స్-లేబర్, కమర్షియల్ వెహికల్ మైనర్ సర్వీస్, కస్టమర్ డిమాండ్ సర్వీస్, కూలంట్స్ వంటి ప్యాకేజీలు లభిస్తాయి. కారు కొనుగోలు సమయంలో లేదంటే కొనుగోలు అనంతరం ఏదైనా మారుతీ సుజుకీ వర్క్‌షాప్ వద్ద తమకు కావాల్సిన ప్యాకేజీలను కస్టమర్లు ఎంపిక చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా అన్ని మారుతీ సుజుకీ వర్క్‌షాప్‌ల్లో ఈ ప్లాన్ చెల్లుబాటు అవుతుంది.

ప్రైవేట్ వెహికల్ కస్టమర్లకు రెండేళ్లు /20,000 లేదంటే 10 ఏళ్లు/1,00,000 కిలోమీటర్ల ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చు. కమర్షియల్ కస్టమర్ల కోసం 10 ఏళ్లు /1,60,000 కిలోమీటర్ల వరకు కంపెనీ ప్యాకేజీలు ఉన్నాయి. కొనుగోలు సమయంలో ఎంపిక చేసుకున్న సర్వీస్ ప్యాకేజీల ధరలు ముున్ముందూ వర్తిస్తాయి. భవిష్యత్తులో సర్వీస్ ఛార్జీలు పెరిగినా ఆ భారం వినియోగదారుడిపై ప్రభావం చూపదు. ప్రీపెయిడ్ సర్వీస్ ప్యాకేజీల ద్వారా భవిష్యత్తులో వినియోగదారులకు 10 శాతం వరకు లేబర్ ఖర్చులు తగ్గుతాయని కంపెనీ మెనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాసి టకేయుచి తెలిపారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
4-8-2026

# దమ్మపేట ప్రగతికి రూ. 1.10 కోట్లు

## ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఎస్కే దస్తగీర్ మాతృమూర్తిని పరామర్శ...

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

ప్రణాళికాబద్ధంగా నిధులు వ్యయం..

దమ్మపేటను మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుతాం..

**దమ్మపేట, (సింగిడి):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. ఆదివారం దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఆయన విస్తృతంగా పర్యటించారు. 'హలో శుభోదయం' కార్యక్రమంలో భాగంగా రూ. 1.10 కోట్ల (కోటి పది లక్షల రూపాయల) భారీ వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, ఆధునిక కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... గ్రామాల ప్రగతి కోసం ప్రభుత్వం కేటాయించే నిధులను రూపాయి కూడా వృథా కాకుండా, పూర్తి ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తున్నట్లు వివరించారు. దమ్మపేట గ్రామ పంచాయతీని నియోజకవర్గంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఏ ప్రాంతానికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో ముందే గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసి నిధులను వ్యయం చేస్తున్నామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో రాజీ పడేదే లేదని అధికారులను ఆదేశించారు.

**ప్రజల ముంగిటకే పాలన – హామీల అమలు**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి తాము కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. దమ్మపేట పరిధిలోని అంతర్గత రహదారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గాను వివిధ వీధుల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణాన్ని





త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే, ప్రజలందరికీ సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడేలా అన్ని వసతులతో కూడిన నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.

**ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ దస్తగీర్ మాతృమూర్తిని పరామర్శ**

దమ్మపేట పర్యటనలో భాగంగా ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఎస్కే. దస్తగీర్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, నేరుగా వారి నివాసానికెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ఆరోగ్య విషయంలో ఎలాంటి అవసరమున్నా తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్వతనేని వర ప్రసాద్ రావు మాతృమూర్తి పర్వతనేని భూషణమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వర ప్రసాద్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉపసర్పంచ్ అంగోతు శ్రీను, సీనియర్ నాయకులు చిన్నంశెట్టి యుగంధర్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు..




**పాలేరు (సింగిడి):** ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు మండలం లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సోషల్ మీడియా వేదికగా స్నేహితులకు పలు సందేశాలను పంపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో స్నేహితులు సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కోరట్లగూడెం లో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ షిఫ్ డే ని నిర్వహించారు. స్నేహితులకు ఫ్రెండ్స్ షిఫ్ బ్యాండ్ కట్టి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు షేక్ సైదా, షేక్ మహబూబ్, పాషా,లాల్పాషా, రావూరి సాయి, కొత్తపల్లి సాయి, గడిపల్లి నవీన్,గుండా అజిత్, షేక్ రాహుల్, మీసాల తేజ,మార్తి భరత్, షేక్ రహీం, బాషా, షేక్ షిలార్, గుండా కోటి, కందికొండ రవితేజ, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని ప్రజలకు వివిధ శాఖల అధికారులు వాట్సాప్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## శాంతి యాగాల ద్వారా మనశ్శాంతితో పాటు కష్టాలు తొలగుతాయి

91వ విశ్వశాంతి యాగానికి

2,50 లక్షల వేల విరాళం అందజేసిన సంజు కుమార్ యాదవ్



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న 91వ శ్రీకృష్ణ కాలచక్ర విశ్వశాంతి మహా యాగం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ మనీలా సంజీవ్ యాదవ్ యాగ స్వామీజీ కి 2,50,000 లక్షల యాభై వేల రూపాయల విరాళాన్ని ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకులు జూలూరి రమేష్ బాబు కి అందజేసి తన ఆధ్యాత్మిక సేవాభావాన్ని వారు మాట్లాడుతూ, ప్రపంచ శాంతి, ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఈ మహాయాగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యాగ నిర్వాహకులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో, నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు భక్తులు యాగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో బిఎస్పీ జెండా ఎగరవేస్తాం

–యు. రమేష్ బాబు, కాశీనాథ్



**కొడంగల్, (సింగిడి):** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ లో బిఎస్పీ జెండా ఎగరవేస్తామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ యు. రమేష్ బాబు,కాశీనాథ్ లు అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో శనివారం రాత్రి గ్రామ కమిటీ నూతనంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, బిఎస్పీ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఏకమై అధికారం సాధించుకుందామని పిలుపునిచ్చారు.

**నూతన గ్రామకమిటి ఎన్నిక**

అన్నారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గా బైండ్ల శేఖర్, ఉపాధ్యక్షుడు గా నడిమింటి వెంకట్, గువ్వ పాండు, ప్రధాన కార్యదర్శి గా మండి నరేష్, సహాయ కార్యదర్శి లుగా శ్రీనివాస్, కోడిగంటి చంద్రప్ప, కోశాధికారిగా నడిమింటి నారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పలువురు బిఎస్పీ పార్టీ లో చేరారు. బిఎస్పీ పార్టీ లో చేరిన వారికి రమేష్ బాబు పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, అసెంబ్లీ కోశాధికారి అరుణ్ కుమార్,అన్నారం సాయిలు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య నివారణకు ఎలక్ట్రిక్ వాహనాలే శరణ్యం

గంప వెంకటేష్ గుప్తా



**ఆమనగల్లు, (సింగిడి):** ప్రస్తుత సమాజంలో విపరీతమైన పొగ కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని అధిగమించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఆదివారం కడ్తాల్ మండలం అయ్య సాగర క్షేత్ర సమీపంలో ఏర్పాటు చేసిన రేంజర్ ఇవి ఫాస్ట్ చార్జింగ్ పాయింట్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బ్యాటరీ వాహనాలను కొనుగోలు చేసి ఇంధనాన్ని ఆదా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి డైరెక్టర్ మంగళపల్లి నరసింహ, , అమృతం పాండు, జగన్ నాయక్, తులసి రామ్ నాయక్, నరేందర్, శాంతి లాల్ తదితరులు పాల్గొన్నారు.



## జైల్ భరోను జయప్రదం చేయాలి

కార్మిక శ్రామిక వర్గ సమస్యలు పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం విఫలం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే వీబిజీ రామ్ జీ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అన్నవరపు కనకయ్య డిమాండ్

**ములకలపల్లి, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి కేంద్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల పొట్టను కొట్టి బడా కార్పొరేట్ దారులకు దోచి పెడుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య విమర్శించారు. ఆదివారం మండల కేంద్రములోని ప్రజా సంఘాల కార్యాలయం లో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు... మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న దేశ వ్యాప్తంగా జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం రైతాంగ సమస్యలు పరిష్కరించాలని పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు రోడ్లు ఎక్కితే రైతుల పై అన్యాయం అక్రమ కేసులు బనాయించి రైతు ఉద్యమాలను అణిచి వేస్తుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ సిలిండర్ల, నిత్యా అవసర సరుకుల ధరలు పెంచి సామాన్య ప్రజానికం పై అధిక భారం మోపుతుందని ఈ పెరిగిన ధరలకు సామాన్య ప్రజలకు పెను భారంగా మారిందని అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ చట్టాలను తీసుకొచ్చి కార్మికుల మెడకు ఉరితాడు లా మారాయని 8 గంటల పనిని రద్దు చేసి ఆ స్థానంలో 12 గంటల పని విధానం తీసుకొచ్చి ఈ నాలుగు లేబర్ కోడ్ లను రాష్ట్రప్రభుత్వాల పై ఒత్తిడి తెచ్చి అమలు చేసేందుకు కుట్ర జరుగుతోందని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానం వి బి జీ రామ్ జీ చట్టాన్ని తీసుకొచ్చి ఉపాధి హామీ కార్మికుల పొట్టను కొడుతుందని ఉపాధి హామీ పథకం తొలగించేందుకే వి బి జీ రామ్ జీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. వి బి జీ రామ్ జీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు 200 వందల రోజుల



పని పెంచి రోజు కూలీ 600 రూపాయలు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు, ప్రజా ఉద్యమాల్లో కార్మికులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహా కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వూకంటి రవికుమార్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మాలోతు రావూజ,గౌరీ నాగేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, గోపగాని లక్ష్మీ నరసయ్య,పాయం అమల, భూక్యా శ్రీదేవి,భూక్యా సామిని,క్రాంతి, గద్దం వెంకటేశ్వర్లు,వినోద్, సూజత, తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో జనసేన 'జన జాతర'..

# భారీ బైక్ ర్యాలీతో మార్మోగిన నియోజకవర్గం!

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నడుం బిగించాలి

దమ్మపేటలో నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం సక్సెస్..

ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి జిల్లా నేత గడల శ్రీనివాసరావు

ఎస్కే రహీం ఆధ్వర్యంలో తరలివచ్చిన జనసైనికులు..

**దమ్మపేట, (సింగిడి):** మండల కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్ వేదికగా జన సేన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు ఎస్కే రహీం నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గ నలుమూలల నుంచి వందలాది మంది జన సైని కులు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రంలో జన సేన జెండాలు చేతబూని, వందలాది మోటార్ సైకిళ్లతో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ పట్టణ పురవీధుల గుండా సాగింది. 'జై జన సేన', 'పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో దమ్మపేట పురవీధులు మార్మోగాయి. యువత అత్యంత ఉత్సాహంతో ఈ ర్యాలీలో పాల్గొని పార్టీ బలాన్ని నిరూపించారు. అనంతరం కార్యకర్తలంతా భారీ ప్రదర్శనగా వినాయక ఫంక్షన్ హాల్ లోని సభా ప్రాంగణానికి చేరుకు న్నారు. దీంతో ఫంక్షన్ హాల్ ప్రాంగణం అంతా జన సేన జెండాలతో, కార్య కర్తల నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్ర మానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా జన సేన పార్టీ ముఖ్య నాయకులు గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం: గడల శ్రీనివాసరావు**



సమావేశంలో జిల్లా నాయకులు గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో జన సేన పార్టీని నియోజకవర్గంలో ఒక బలమైన శక్తిగా ఎదిగించేందుకు ప్రతీ ఒక్కరూ శ్రమించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి కమిటీలను బలోపేతం చేయాలనీ, ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. జన సేన అధినేత ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రజా సమస్యలపై జన సేన ఎల్లప్పుడూ రాజీలేని పోరాటం చేస్తుందని, స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



**అందరి సహకారంతో ముందుకు: ఎస్కే రహీమ్**

ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, మండల అధ్యక్షుడు ఎస్కే రహీం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఆత్మీయ సమ్మేళనాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసినందుకు నియోజకవర్గ జన సైనికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును ప్రతీ గ్రామానికి తీసుకెళ్తామని, ప్రజాపక్షాన నిలబడి మరిన్ని సేవా కార్యక్రమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించా రు. భారీగా తరలివచ్చిన శ్రేణులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో మండల, నియోజకవర్గ స్థాయికి చెందిన పలువురు ముఖ్య నాయకులు ప్రసంగించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి యువత, మహిళలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేశారు.




## శ్రీరాముడి సేవలో ముద్దసాని కుటుంబం..

రూ.3.36 లక్షల విలువైన గ్రానైట్, గర్భగుడి టైల్స్ విరాళం



**భిక్కనూరు, (సింగిడి):** భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీరామ మందిరానికి ప్రముఖ వ్యాపారవేత్త, రామేశ్వర్‌పల్లి వాస్తవ్యులు ముద్దసాని రాజు–మాలతి దంపతులు, వారి కుమార్తె వర్షిత, కుమారుడు రోహన్ కలిసి రూ. 3.36 లక్షల విలువైన గ్రానైట్‌తో పాటు గర్భగుడికి అవసరమైన టైల్స్‌ను విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణంలో తమ వంతు సహకారం అందించిన వారి దాతృత్వాన్ని గ్రామస్థులు అభినం దించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీరామునిపై భక్తితో ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన ముద్దసాని కుటుంబాన్ని అభినందించారు. ఇలాంటి దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణ పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. శ్రీరాముని ఆశీస్సులు ముద్దసాని కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంకం రాజు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యం: మహిపాల్‌రెడ్డి




**చేవెళ్ల (సింగిడి):** ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని సాయి చైతన్య హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తేనే ఉన్నత విద్య పటిష్టమై, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దుగ్గి గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రభు త్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు. రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యా యుల బదిలీలు చేపట్టి పాఠశాలలు మూతపడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీఓ నంబర్ 25ను సవరిం చాలని డిమాండ్ చేశారు. 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించి, ఈ అం శంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని మహిపాల్‌రెడ్డి కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ డీఏలు, పీఆర్సీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్యక్ర మం లో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామ్ శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అధ్యక్షులుగా దేవసాని సాంబయ్య ఎన్నిక



**కమలాపూర్, (సింగిడి):** మం డలం లోని పంగిడిపల్లి గ్రా మంలో పద్మశాలి సం ఘం నూ తన కార్యవ ర్గాన్ని ఆది వారం ఏకగ్రీ వంగా ఎన్ను కున్నారు. సంఘం అధ్య క్షులు దేవసాని సాంబయ్య, గౌరవ అధ్యక్షులు మొండయ్య, ఉపాధ్యక్షులుచేరాల రాజమౌళి,కార్యదర్శి దేవసాని సాంబయ్య (చంటయ్య), డైరెక్టర్లు వేముల తిరుపతి,కొక్కుల రాజయ్య, దేవసాని రమేష్, నాగుల మొగిలి నాగుల సాంబయ్య, నాగులశ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనఅధ్యక్షుడిని పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు శాలువాలతో సత్కరించిశుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరానగర్ నల్ల పోచమ్మ ఆలయ
# నూతన కమిటీ ఏర్పాటు



**నాచారం, (సింగిడి):** హెచ్ఎంటి నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులు బొల్లం చెంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి పెంటం రమేష్ కుమార్, ట్రెజరర్ బి బాలయ్య, ఉపాధ్యక్షులు గద్దం రాజిరెడ్డి, కె అశోక్, ఆర్ శ్రీశైలం, పి సురేందర్ స్వామి, ఆర్. శ్రీధర్, కె నిఖిల్ సాయి, జాయింట్ సెక్రెటరీలు ఉమామహేశ్వర చారి, శేఖర్ గుప్తా, రమేష్, అంజయ్య, విజయ్ కుమార్, సాయికుమార్, ఇంద్రసేనారెడ్డి, యాదగిరి ఆర్గనైజర్స్ కాళిదాస్, శ్యాం కుమార్, శ్రీను నాయక్, బాల సిద్దులు, రవికుమార్, రాములు, రవి మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రభాకర్, బాలమల్లు, వెంకటేష్, సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్, రాంప్రసాద్, కృష్ణ, శ్రీనివాస్, ప్రభాకర్, రవి, సుధాకర్, శ్రీనివాస్ జన, శివ, రమేష్, రవి చారి, గోపాల్, మహేష్, ఉప్పలయ్య ఎన్నికైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నాచారం బీజేపీ నాయకులు పోతగాని గోపాల్ గౌడ్, మోర నరసింహారెడ్డి, మంజుల వాణి, జి కృష్ణారెడ్డి, మహేష్ యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామిశెట్టి రాజు మృతి
# బీఆర్ఎస్‌కు తీరని లోటు



**కాటారం, (సింగిడి):** మండలంలోని దామరకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ సోషల్ మీడియా ఇంచార్జ్, క్రియాశీలక నాయకుడు రామిశెట్టి రాజు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి తీరని లోటని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సతీమణి పుట్ట శైలజ అన్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు పుట్ట శైలజ దామరకుంట గ్రామానికి చేరుకుని రామిశెట్టి రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం రామిశెట్టి రాజు పార్థివ దేహంపై బీఆర్ఎస్ పార్టీ కండువా, పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పుట్ట శైలజ మాట్లాడుతూ, రామిశెట్టి రాజు వంటి నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోవడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని, పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిపిఓ స్వాధీనం చేసుకున్న రెండు టిప్పర్లు జెసిబిలు ఎక్కడ..?

మార్గ మధ్యలో వాహనాలు తప్పించారంటున్న జిపిఓ
తాసిల్దార్ కి పోలీసులకు ఫిర్యాదు చేశా : జి పి ఓ



**ఇల్లందు,(సింగిడి):** నాలుగు రోజుల క్రితం మండలంలోని లచ్చగూడెం పంచాయతీ లోని సర్వేనెంబర్ 99 ఉన్న అటవీ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆ ప్రాంత జిపిఓ సత్యనారాయణ రెండు రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ అక్రమ తవ్వకాలు జరుగుతున్న వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జిపిఓ తనిఖీలు చేసిన సమయంలో ఫ్రెండ్స్ ట్రాన్స్పోర్టేషన్ పేరిట ఉన్న టిఎస్ 28,7966, టిఎస్28 0458 రెండు టిప్పర్లు, నెంబర్ కనిపించకుండా చిరిగిపోయిన ఒక జెసిబి వాహనం ఉండగా వాటిని స్వాధీనం చేసుకొని ఆ ప్రాంతం నుండి ఇల్లందు తాసిల్దార్ కార్యాలయానికి తరలిస్తున్నారు. కొంత దూరం వచ్చిన తర్వాత వాహనలు నడిపే డ్రైవర్లు మభ్యపెట్టి మార్గమధ్యలో తప్పించుకొని వెళ్లినట్లు స్వయంగా జీవించారు ఈ విషయాన్ని తాసిల్దార్ కు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు..

### నెంబర్ల సహకారంతో ఆర్టీవో ఫిర్యాదు.. బైండోవర్ కేసు చేసేనా.?

రెవెన్యూ అధికారులను గురుడి కొట్టించి మార్గమధ్యలో వాహనాలు తప్పించుకొని తీసుకువెళ్లిన ఫ్రెండ్స్ ట్రాన్స్పోర్ట్ యజమాని పై ఆర్ టి ఓ అధికారులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తారా లేక పోలీసులకు చేసి వాటిని స్వాధీనం చేసుకొని వాస్తవస్తాలను బయటికి తేల్చి చెప్తారా అనేది తేలాల్సి ఉంది. ఇక రెవెన్యూ అధికారులు పలు ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్న సందర్భంలో ఎవరైతే అక్రమమైనింగ్ పాల్పడ్డారు వారి పై బైండోవర్ కేసులు నమోదు చేశారు ఇదే తరహాలో ఫ్రెండ్స్ ట్రాన్స్పోర్ట్ నిర్వాహకులు చేస్తున్న అక్రమ మైనింగ్ చేస్తారా లేదా అనేది గతంలో బైండోవర్ కేసు నమోదు కాపాడిన వ్యక్తులు వేచి చూస్తున్నారు. వారి పట్ల రెవెన్యూ పోలీస్ ఆర్టీవో అధికారులు ఉదాసీన వైఖరి కనిపిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు గతంలో బైండోవర్ కేసు నమోదు అయిన వ్యక్తులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# పాముకాటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి



**అమరచింత, (సింగిడి):** పాముకాటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి చెందిన సంఘటన అమ రచింత మండలంలోని సింగంపేట గ్రామంలో ఆది వారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సింగంపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ చిన్న ఆంజనేయులు తన పొలంలో పని చేస్తుండగా పాము కరిచిందని పక్కనే ఉన్న రైతులకు చెప్పాడు. వెంటనే ఆయనను ఆత్మకూరు ప్రభుత్వాసు పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్నేహి తుల రోజునఆయన చనిపోవడం వల్ల అతని స్నేహితులు శోక సముద్రంలో మునిగిపోయారు. కాగా మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఓ కుమారుడు ఉన్నట్లు తెలిసింది.

# ఆకట్టుకో దోచుకో...

- టమాట ఆశ చూపి కస్టమర్ కి కుచ్చు టోపీ
- రూ 10ల ఆశ చూపి రూ 100ల దోపిడీ
- కూరగాయల వ్యాపారుల కాసుల దోపిడీ
- దుకాణం వద్ద కనిపించని ధరల పట్టిక
- నియంత్రణ లేక నచ్చినంత దోచుకుంటున్నా...

**ఇల్లందు (సింగిడి):** కిలో పది కిలో పది టమాట అగువా అగువా అంటూ కస్టమర్లను ఆకట్టుకుంటూ అందిన కాడికి దోచుకుంటు న్నారు. కిలో టమాటాను రూ. 10కు విక్రయిస్తున్నామని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ, ప్రజలను మార్కెట్ కు ఆకర్షిస్తున్న వ్యాపారులు,అదే సమయంలో ఇతర కూరగాయల పై అధిక ధరలు వసూలు చేస్తూ వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. టమాటా మాత్రమే కొనుగోలు చేయడానికి వచ్చిన వారికి విక్రయించకుండా, ఇతర కూరగాయలను కూడా కొనుగోలు చేస్తేనే టమాటా ఇస్తాము అనే కండిషన్ పెడుతున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు.

**ఎవరికి నచ్చిన ధర వారే పెంచుకుంటున్నారు...**

రిటైల్ మార్కెట్లో కిలో బెండకాయ రూ. 40కు లభిస్తుండగా, నూతన వెజిటేబుల్ మార్కెట్లో అదే బెండకాయను రూ. 80 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇదే విధంగా ఇతర కూరగాయలను అసలు ధరల కంటే రెండింతలు, మూడింతలు రెట్టింపు చేయటం ,మరి కొన్నిచోట్ల ఐదు నుంచి ఆరు రెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఇటు రైతులు అటు ప్రజలను దోచుకుంటున్నారు**

ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పంటలను సాగు చేసే రైతుకు దక్కేది కొంతరతే. పంటను కోసి అమ్మడంకు మార్కెట్ కు వచ్చిన రైతుకి కూరగాయల వ్యాపారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకే వందల రూపాయలకు కింటాలలో కూరగాయలను కొనుగోలు చేసి వీటిని కొనుగోలు చేసేందుకు వచ్చే కస్టమర్ల వద్ద నుంచి వేల రూపాయల లాభాలను గడిస్తున్నారు. రైతు వద్ద కిలో పది రూపాయలకు వారు తెచ్చిన కూరగాయలను కొనుగోలు చేసి రూ 80 నుండి 100 రూపాయల చొప్పున అమ్మతో వినియోగదారుల జేబులోకి చిల్లు పెడుతున్నారు. వ్యాపారస్తుల మూలాన కష్టపడి పండించిన రైతుల శ్రమకు ఫలితం దక్కకపోగా కొనుగోలుదారుడికి సైతం లాభం లేకుండా పోయింది. దీతో ఎలాంటి శ్రమ లేకుండా మధ్యస్థంగా వ్యాపారం చేసే వ్యాపారస్తుడు లాభాలార్జిస్తున్నాడు.



**ధరల పట్టిక తో పాటు నియంత్రణ అవసరం**

ప్రతి కూరగాయల దుకాణం వద్ద వారి అమ్మే కూరగాయలకు సంబంధించిన ధరల పట్టికను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కూరగాయలు ఎంత ధర అనేది రోజువారి దుకాణాల వద్ద కచ్చితంగా ఉండాలనే వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు దీన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు తక్షణమే బోర్డ్ లో ఏర్పాటుతోపాటు ధరల నియంత్రణ సైతం చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఎవరికి నచ్చిన ధరను వారు నిర్ణయించి అమ్మకాలు కొనుగోలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్న వ్యాపారస్తుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తక్షణమే దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# ఘనంగా ఇల్లందులో ఆషాడ బోనాల మహోత్సవం...

**ఇల్లందు,(సింగిడి):** పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆషాడ బోనాల మహోత్సవం అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధలతో, పోతురాజుల విన్యాసాలు డప్పుచప్పులు మేళాలు వాయిద్యాలు నడుమ జరిగాయి. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలైన చెరువు కట్ట శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం, 2వ వార్డు ఇల్లందులపాడులో శ్రీ కాళీమాత ఆలయాల్లో ఆషాడ బోనాల మహోత్సవం వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ ప్రాంగణంలో పట్నాలు వేసి భక్తును ఆకట్టుకోండమే కాకుండా వాటి ముందు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**బోనమెత్తిన మున్సిపల్ చైర్ పర్సన్ కిరణ్ మిత్ర...**

ఇల్లందులపాడు కాళికామాత ఆలయం వద్ద నిర్వహించే ఆషాడ బోనాలు మహోత్సవం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి,మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు మడుగు సామామూర్తి సతీమణి మడుగు వెంకటలక్ష్మి స్వయంగా కాళీమాత తల్లి బోనాలను తలపై మోసుకొని భక్తి భావంతో అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసం..**

బోనాల మహోత్సవం సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి జైజైధ్వానాలతో ఇల్లందులపాడు ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాళీమాత తల్లి ఆలయ ప్రధాన సేవకులు రమేష్, ఆలయ పూజారి ఓం భాయ్,ఎం.డి. యాకూబ్, నేలమర్రి నాగరాజు, దొడ్డ బబాబీ,రత్తారపు మల్లేశ్వరి, సాతెళ్ల యాదగిరి, కొత్తపల్లి నవతేజ, చింతలచెరువు సింహాద్రి (సుమంత్), కొండపల్లి సంపత్, దళితరత్న మేకల శ్యామ్ మాదిగ, అందే భరత్, కూతురు రవి, పసునూరి సాంబయ్య, బోయ రమేష్, బోశాల దుర్గారావు, బోశాల శశాంక్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.





# భవన నిర్మాణ అనుమతుల వ్యవహారంపై ఆర్డీడీ విచారణ...

మెట్ పల్లి మున్సిపాలిటీలో పర్మిషన్ వివాదంపై ఆధారాల సేకరణ
బాధితురాలి ఫిర్యాదు మేరకు పత్రాల పరిశీలన.. నివేదిక అనంతరం తదుపరి చర్యలు: అధికారులు

**మెట్ పల్లి, (సింగిడి):** మెట్ పల్లి మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇంటి నిర్మాణానికి అనుమతి ఇప్పిస్తామని చెప్పి నగదు తీసుకున్నారని, అనంతరం చెల్లుబాటు కాని అనుమతి పత్రాన్ని అందజేసి తర్వాత అదే నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారంటూ బాధితురాలు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ప్రాంతీయ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్డీడీ) ఆధ్వర్యంలోని బృందం శనివారం మెట్ పల్లిలో విచారణ చేపట్టింది. బాధితురాలు జగ్గుల లావణ్య తెలిపిన వివరాల ప్రకారం, 2023లో ఇంటి నిర్మాణ అనుమతి కోసం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించగా, అవసరమైన ప్రక్రియ మొత్తం తామే పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నగదు తీసుకున్నారని, అనంతరం అందజేసిన అనుమతి పత్రాన్ని నమ్మి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించానని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే నిర్మాణం కొనసాగుతున్న సమయంలో అదే నిర్మాణంపై నోటీసులు జారీ కావడంతో తాను మోసపోయినట్లు గుర్తించానని, సమస్య పరిష్కరిస్తామని చెప్పి మరోసారి నగదు డిమాండ్ చేశారని కూడా ఆరోపించారు. ఈ ఫిర్యాదు జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ప్రాథమిక స్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు, సంబంధిత అంశాలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం పూర్తి స్థాయి




వాస్తవాలను నిర్ధారించేందుకు ఆర్డీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ కొనసాగుతోంది. విచారణలో భాగంగా బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసిన అధికారులు, ఆమె సమర్పించిన పత్రాలు, నిర్మాణానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే సంబంధిత అధికారుల నుంచి వివరణలు తీసుకుని, అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులు, అనుమతి దరఖాస్తులు, కార్యాలయ పత్రాలను పరిశీలించినట్లు తెలిసింది. అవసరమైన ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అధికారులు వెల్ల డించారు. సేకరించిన ఆధారాలు, పత్రాల పరిశీలన అనంతరం నిబంధ నలకు అనుగుణంగా తదుపరి పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికా రులు పేర్కొన్నారు. విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ణయానికి రావడం సరికాదని, అన్ని కోణాల్లో వాస్తవాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో మున్సిపాలిటీలో గతంలో జారీ చేసిన భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియపై కూడా పారదర్శకంగా సమీక్ష నిర్వహించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. విచారణ నివేదిక వెలువడిన అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం మెట్‌పల్లి పట్టణంలో విస్తృత చర్చకు దారితీసింది.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ దేశవ్యాప్త ఉద్యమం

ఆగస్టు 4 నుంచి 10 వరకు పాదయాత్రలు, సంతకాల సేకరణ
## నల్లబెల్లిలో సీపీఐ సమావేశంలో చింతకింది కుమారస్వామి వెల్లడి

**నల్లబెల్లి, (సింగిడి):**:విద్య, వైద్యం, విద్యుత్ రంగాల ప్రైవేటీకరణ, రైతు పంటల కొనుగోలుపై 35 శాతం పరిమితి, ఉపాధి హామీ పథకంపై ఆంక్షలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సీపీఐ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు సీపీఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి తెలిపారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 4 నుంచి 10 వరకు గ్రామాల్లో పాదయాత్రలు, ప్రజల సంతకాల సేకరణ కార్యక్రమాలునిర్వహించనున్నట్లు వెల్లడించారు. నల్లబెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కొనకటి రమేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగసంస్థలను వరుసగా ప్రైవేటీకరిస్తూ ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ కారణంగా పేద, మధ్యతరగతికుటుంబాలకు నాణ్యమైన విద్య, వైద్యం అందని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అడ్మిషన్లు, డొనేషన్లు, కోచింగ్ ఫీజుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయని, మరోవైపు ప్రశ్నాపత్రాల లీకేజీలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉందన్నారు. వ్యవసాయ రంగంలో కల్తీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగుమందులు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంటల కొనుగోలుపై పరిమితులు విధించడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అమెరికా ట్రేడ్ డీల్ వంటి విధానాలు స్వదేశీ రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి రాష్ట్రాలపై 40 శాతం ఆర్థిక భారం మోపడం, రాష్ట్రాల వాటా విడుదల కాకపోతే కేంద్ర నిధులు




నిలిపివేస్తామనడం వల్ల ఉపాధి హామీ పథకం బలహీనపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మండల పార్టీ కమిటీ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. వ్యక్తిగత కారణాలతో మండల కార్యదర్శి బాధ్యతల నుంచి బట్టు సాంబయ్య తప్పుకోగా, నూతన మండల కార్యదర్శిగా పరికి కోర్నేలు, సహాయ కార్యదర్శులుగా కడియాల క్రాంతికుమార్, మామిండ్ల పెద్ద ఐలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కొనకటి రమేష్, మర్రి రమేష్, అనుమాండ్ల కొంరెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శిగా వల్లే రమేష్ యాదవ్

పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా
-నూతన జిల్లా కార్యదర్శి



**నల్లబెల్లి, (సింగిడి):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా నల్లబెల్లి మండలం వల్లే నర్సయ్యపల్లె గ్రామానికి చెందిన వల్లే రమేష్ యాదవ్ నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతను అప్పగించడం పట్ల స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వల్లే రమేష్ యాదవ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్, నర్సంపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కంభంపాటి పుల్లారావు, నియోజ కవర్గ, మండల స్థాయి నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామస్థా యిలో ప్రజలకు చేరవేయడంతో పాటు ఓబీసీ వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యువతను, వెనుకబడిన వర్గాలను పార్టీ వైపు ఆకర్షిస్తూ బీజేపీ సంస్థాగత బలోపేతానికి శక్తివంచన లేకుండా సేవలందిస్తానని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఓబీసీ మోర్చాను మరింత చైతన్యవంతం చేయడం, పార్టీ, కార్యక్రమా లనుసమ ర్థవంతంగా నిర్వహించడం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని వల్లే రమేష్ యాదవ్ తెలిపారు. వల్లే రమేష్ యాదవ్ నియామకాన్ని స్వాగతించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శు భాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి ఆయన సేవలు మరింతఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లో
# బోనాల ఉత్సవాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు
తోకల శ్రీనివాస్ రెడ్డి




**రాజేందర్ నగర్, (సింగిడి):** రాజేంద్రనగర్ నియోజ కవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బోనాల పండుగ ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగాయి. ఆదివారం డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, పల్లె చెరువు, లక్ష్మీ గూడా, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో వెలసిన శ్రీ అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఆయా ఆలయాలను దర్శించుకున్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ... రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతో షాలతో, సమృద్ధిగా ఉండాలని ఆ జగన్మాతను ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, పార్టీ నాయకుల, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఆలయాల వద్దకు వచ్చిన భక్తులను పలకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అడికే జనార్ధన్, రమేష్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, మధుసూదన్, రావుల భాస్కర్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డిలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**ఎల్బీనగర్, (సింగిడి):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురై ప్రభుత్వానికి పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను పూర్తిగా కాలరాసిందని ఆయన విమర్శించారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే గతంలో రైతులు ఢిల్లీలో చారిత్రాత్మక ఉద్యమం చేపట్టారని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ పోరాటాలన్నీ కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, విద్యార్థి--యువజన వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత,




సంక్షేమ పథకాలు, కనీస వేతనాల అమలు, ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. అనంతరం మహాసభలో పాల్గొన్న సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, దేశంలో అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న వారు అసంఘటిత రంగ కార్మికులేనని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ యజమానులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘాలు, రైతు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా




పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యత ద్వారానే వారి హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యూసఫ్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు, రామస్వామి, బి.దత్తు నాయక్, శేఖర్ రెడ్డి చందు యాదవ్, కొమ్మ గళ్ళ రాజు, పబ్బతి లక్ష్మణ్, నరసింహారెడ్డి, దేవేంద్ర గౌడ్, బ్రహ్మాచారి ,యాదగిరి, ఆర్టీసీ వెంకన్న, శివ చంద్రశేఖర్ అనిల్ రవి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కోదాడ విద్యార్థుల సత్తా



**కోదాడ, (సింగిడి):** హైదరాబాద్‌లో జరిగిన 2వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్--2026లో కోదాడకు చెందిన కరాటే క్రాంతి అకాడమీ విద్యార్థులు పలు పతకాలు సాధించి ప్రతిభ చాటారు. మోకా అక్షయ కుమిటే విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, కొండపల్లి శ్రీనిత్య, కడారు ఏశ్వంత్ కుమార్ సిల్వర్, గురజాల ఉద్వేక్ బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో కోదాడకు మంచి గుర్తింపు తీసుకొచ్చారు. విజేతలను కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్ అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ముష్కి చెరువు వద్ద ఘనంగా 'మెగా ప్లాంటేషన్ డ్రైవ్'



**రాజేంద్రనగర్, (సింగిడి): :** నార్సింగి సర్కిల్ పరిధిలో ప్రకృతిని మనం రక్షిస్తే.. ఆ ప్రకృతే మనల్ని రక్షిస్తుందనే ఉన్నతమైన ఆశయంతో ముష్కి చెరువు పరిసర ప్రాంతాల్లో ఆదివారం భారీ ఎత్తున 'మెగా ప్లాంటేషన్ డ్రైవ్' గ్రాండ్ గా నిర్వహించబడింది. చెరువు చుట్టుపక్కల ఉండే కాలనీవాసులు, ప్రకృతి ప్రేమికులు ఏకమై ఈ పర్యావరణ పరిరక్షణ మహత్కార్యానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో హాల్‌మార్క్ విసినియా, మైహోమ్ అవతార్, సాయి గౌతమ్ కాలనీ, ఆర్చిడ్ అపార్ట్‌మెంట్స్, పెంటయ్య కాలనీ, కులీ కుతుబ్ షా కాలనీ నివాసితులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ మద్దతు తెలిపారు.

**కార్యక్రమం యొక్క ముఖ్య వివరాలు:**
**500 నేటివ్ మొక్కలు:** ప్రాంతీయ వాతావరణానికి తగిన సుమారు 500 నేటివ్ మొక్కలను చెరువు పరిసరాల్లో నాటాలన్నారు.

**భారీ భాగస్వామ్యం:** పర్యావరణ స్పృహతో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా శ్రమదానంలో పాల్గొన్నారు.

**ముఖ్య సందేశం:** "మొక్కలను నాటడం మాత్రమే కాకుండా, వాటిని సంరక్షించి పెద్దవి చేసే వరకు బాధ్యత తీసుకుంటాం" అని స్థానిక నివాసితులు పునరుద్ఘాటించారు. పరిసర ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంచడం మరియు ముష్కి చెరువు పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ డ్రైవ్‌ను పలువురు అభినందించారు. చెరువు పరిరక్షణకు, భవిష్యత్ తరాల స్వచ్ఛమైన గాలికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## కారు యూనియన్ సర్పంచ్‌గా బానోతు శంకర్ నాయక్ విజయం



**కోదాడ, (సింగిడి):** కోదాడ పట్టణంలోని సాయి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన కారు యూనియన్ సర్పంచ్ ఎన్నికల్లో బానోతు శంకర్ నాయక్ ప్రత్యర్థిపై 130 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఫలితాల అనంతరం సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి, మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించారు. తనపై నమ్మకం ఉంచిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపిన శంకర్ నాయక్, యూనియన్ సమస్యల పరిష్కారం, సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రపంచంలో అత్యంత విలువైనది స్నేహం

**కౌన్సిలర్ ఉమఅంజన్ గౌడ్**



**కోదాడ, (సింగిడి): :** కోదాడ పట్టణంలో ని 30 వ వార్డులో ఈరోజు స్నేహితుల దినోత్సవ సందర్భంగా 30 వ వార్డు కౌన్సిలర్ ఉమఅంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు, ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న అనంతరం ఉమాఅంజన్ గౌడ్ మాట్లాడుతూ ఈ సృష్టిలో కల్మషం లేనిది స్నేహమేనని స్నేహానికి వయస్సు కులం దేశం అంటూ హద్దులు లేవని మనుషులు నిజమైన స్నేహం చేయాలని అన్నారు ఈ కార్యక్రమం లో గునగంటి రాధిక బత్తిని నాగమణి అనురాధ లక్ష్మి నిర్మల తేజ సుజాత ఉష అశ్విని వరలక్ష్మి విజయ మధు శైలజ రమ్య తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మెట్రో కారిడార్‌ను తక్షణమే ప్రారంభించాలి

### డిమాండ్ చేస్తూ మెట్రో సాధన సమితి పాదయాత్ర






**కుత్బుల్లాపూర్, (సింగిడి):** హైదరాబాద్ మెట్రో ఫేజ్-2(టు) కింద మేడ్చల్ మెట్రో కారిడార్ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, మేడ్చల్ మెట్రో సాధన సమితి (ఎం ఎం ఎస్ ఎస్ ) ఆదివారం జీడిమెట్లలోని గాంధీ విగ్రహం నుండి జేబీఎస్ మెట్రో హబ్ వరకు శాంతియుత పాదయాత్రను నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఉత్తర హైదరాబాద్ నలుమూలల నుండి నివాసి సంక్షేమ సంఘాలు (ఆర్ డబ్ల్యూ ఏ ) లు సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత, నిపుణులు మెట్రో మద్దతుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లే కార్డులు చేత పట్టుకొని, భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సమన్వయంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-××(టు) ముఖ్యంగా మేడ్చల్ కారిడార్ కు ఆమోదం తెలుపుతూ పనులను ప్రారంభించి పూర్తి చేయుటకు నాన్యతా ప్రమానాలతో పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మెట్రో సాధన సమితి సభ్యులు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస, పారిశ్రామిక, విద్యా, ఐటీ ప్రాంతాలలో ఉత్తర హైదరాబాద్ ఒకటిగా ఆవిర్భవించిందని, సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ, రహదారి భద్రతా సమస్య లు, కాలుష్యం, సుదీర్ఘ ప్రయాణ సమయాలను ఎదుర్కొంటోందని ఎంఎంఎస్ఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యవహరించి, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు త్వరితగ తిన ఆమోదం లభించి, అమలు జరిగేలా కలిసి పనిచేయాలని సమితి ఇరు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. మెట్రో అనేది రాజకీయ సమస్య కాదని, ఇది లక్షలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చే హైదరాబాద్ నిరంతర ఆర్థిక వృద్ధికి తోడ్పడే ఒక ప్రజా అవసరమని అది నొక్కి చెప్పింది. ఈ పాదయాత్ర ఒక నిరంతర ప్రజాస్వామ్య ఉద్యమంలో భాగమని ఎంఎంఎస్ఎస్ ప్రకటించింది. మెడ్చల్ మెట్రో కారిడార్ మొదటి పిల్లర్ నిర్మించే వరకు శాంతియుత ప్రజా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని మేడ్చల్ మెట్రో సాధన సమితి పునరుద్ఘాటించింది.

## సాలురా మండలంలో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** సాలురా మండలంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హున్సా గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఖాజాపూర్ గ్రామంలో ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు చిద్రపు అనిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. సాలురా మండల కేంద్రం లో సర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ 2, మండల పార్టీ సూపర్వైజర్లకు ఘనంగా సన్మానించారు. జాడి గ్రామంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శీల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు మందర్న రవి, పిఆర్టియు మాజీ జిల్లా అధ్యక్షులు ఇత్తేపు శంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అల్లే రమేష్, కార్యదర్శి ఖాజాపూర్ అశోక్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా... కార్యకర్తకు భరోసాగా!

**మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట ప్రభాకర్ రెడ్డి**

**మునుగోడు, (సింగిడి):** మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం బోడంగ్ పూర్తి గ్రామానికి చెందిన, బి ఆర్ ఎస్ ఉపాధ్యక్షులు, 7వ వార్డు సభ్యులు రేవెల్లి నరేష్ తీవ్ర అనారోగ్యంతో రెండు కిడ్నీలు మరియు ఊపిరితిత్తుల సమస్యలతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అట్టి విషయం తెలుసుకున్న మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం నరేష్‌కి ధైర్యం చెబుతూ, నీకు మేమున్నామని, పార్టీ అండగా ఉంటుందని నీవు ధైర్యంగా ఉండాలని, నీవు త్వరగా కోలుకుంటావని భరోసా కల్పించారు. అంతేకాకుండా, తన వ్యక్తిగత తరఫున ఆర్థిక భరోసా సహాయాన్ని



అందించి తన పెద్ద మనసును చాటుకున్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి నరేష్ కుటుంబం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా, బోడంగిపర్తి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో పాల్గొన్నారు.

## నుచ్చుగుట్ట తాండలో భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల మహోత్సవం



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తాండలో బోనాల మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్పర్సన్ గీత ఆచారి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాండ ప్రజలందరూ చిన్నాపెద్దా తేడా లేకుండా భారీ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆచారి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో ఘనంగా పోచమ్మ పండుగ వేడుకలు

- అంటు వ్యాధులు సోకకుండా చూడాలి
- పెద్దోళ్ల గంగారెడ్డి వెల్లడి

**ఆర్మూర్ , (సింగిడి)::** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలం రామన్నపేట గ్రామంలో గల పడకంటి మొటాటి రెడ్డి సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల బాపురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పోచమ్మ పండుగ నిర్వహించారు. సంఘ భవనం గోడకు గల మైస మ్మకు,సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శ్రీకా రం చుట్టారు. సంఘ భవనం నుండి డప్పు వాయిద్యాలతో, చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్లి బస్టాండ్ లో గల పోచమ్మ తల్లి వద్దకు చేరుకున్నారు. పోచమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి గంపలో తీసుకొచ్చిన అన్నం, బెల్లమన్నం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించి, ఎలాంటి అంటూ వ్యాధులు సోకకుండా చూడాలని మొక్కులు చెల్లించారు. కొబ్బరికాయలు కొట్టారు. బండారు వేసి కల్లుసాక పోసారు. పుట్నాలు, బెల్లం, ఓమ, మిశ్రమంతో కూడిన ప్రసాదాన్ని స్వీకరించారు. పోచమ్మ, గుండేలవ్వ తల్లి కోసం గొర్రెలను,తల్లి సన్నిధిలో బలిచ్చారు. పొట్టేలు జడ్త ఇవ్వగానే పులోరియా, పులోరియా అంటూ నినదించారు. ఈ సందర్భంగా



పడకంటి మొటాటి రెడ్డి సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల బాపురెడ్డి మాట్లా డుతూ, ఆషాడ మాసంలోని ఆదివారం పోచమ్మ పండుగను నిర్వహిం చుకోవడం, పూర్వం నుండి వస్తున్న సంప్రదాయ ఆచారం. గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, సమస్త జీవకోటి ప్రాణులన్నీ బాగుండాలని కోరారు. ఈకార్యక్రమంలో కోళ్లకాడు కంకణాల రవి, మాజీ అధ్యక్షుడు కంకణాల రాజేశ్వర్, పడకంటి బాపురెడ్డి, పంచాక్షర్ రెడ్డి, సాయరెడ్డి, మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మధు రెడ్డి, చిన్న గంగారెడ్డి, సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ స్థలం గ్రామపంచాయతీకే చెందాలి



**గట్ల నర్సింగాపూర్ సర్పంచ్ అజయ్ కుమార్**

**భీమదేవరపల్లి, (సింగిడి):** గ్రామపంచాయతీ కార్యాలయానికి చెందిన స్థలాన్ని గ్రామపంచాయతీ ఆధీనంలోకి అప్పగించాలని గట్లనర్సింగాపూర్ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. 1992లో కొనుగోలు చేసిన గ్రామపంచాయతీ స్థలంలో ఉన్న డెయిరీ భవనాన్ని ఖాళీ చేయాలని ఏప్రిల్‌లో పాలకవర్గం తీర్మానం చేసి పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో ఆదివారం గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి భవనానికి తాళం వేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం ముందు తగిన స్థలం లేక గ్రామసభలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, జిల్లా, మండల అధికారులు జోక్యం చేసుకుని గ్రామపంచాయతీ స్థలంపై పూర్తి హక్కులు కల్పించాలని సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉపసర్పంచ్ బొడిగె శ్రీనివాస్, వార్డు సభ్యులు కోరారు.

## పుణ్యానికి పోతే...

# పాపం ఎదురైంది

**జవహర్ నగర్ లో దారిదోపిడీ**

**లిఫ్ట్ పేరిట బైక్ ఆపి నగదు అపహరణ**

**జవహర్ నగర్ (సింగిడి):** పుణ్యానికి పోతే పాపం ఎదురయ్యింది. లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కిన ఓ వ్యక్తి, మరికొందరితో కలసి ఓ వ్యక్తిని బెదిరించి నగదు, ఆన్‌లైన్ బదిలీ ద్వారా సొమ్ము గుంజిన సంఘటన జవహర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... కీసరలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఆవుల పద్మారావు (52) జులై 31వ తేదీ రాత్రి సుమారు 7:45 గంటల సమయంలో చిన్న పని నిమిత్తం జవహర్ నగర్ లోని అంబేద్కర్ నగర్‌కు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అంబేద్కర్ నగర్ బోర్డు సమీపంలో సుమారు 23 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని యువకుడు ఆయనను లిఫ్ట్ అడిగాడు. మానవత్వంతో పద్మారావు సదరు యువకుని బైక్‌పై ఎక్కించుకోగా, కొద్ది దూరం వెళ్లాక ఆ యువకుడు బైక్‌ను సమీపంలోని ఒక సందులోకి తీసుకువెళ్లాడు. వెంటనే అక్కడికి మరికొందరు వ్యక్తులు చేరుకుని పద్మారావు బైక్‌ను అడ్డుకున్నారు. ఆయనను బలవంతంగా లోపలికి తీసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేశారు. ఈ మేరకు బాధితుని వద్ద ఉన్న రు. నాలుగువేల నగదు ను లాక్కున్నారు. అంతేకాకుండా ఆయన మొబైల్ ఫోన్ నుండి మరొకరి ఖాతాకు రూ. ఎనిమిది వందలు ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఈ విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరిస్తూ నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. బాధితుడు పద్మారావు ఫిర్యాదు మేరకు జవహర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## ఎంపీ మల్లు రవికి కాంగ్రెస్ నేతల స్వాగతం



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు పట్టణంలో శనివారం నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అమనగల్లు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఎంపీ మల్లు రవికి కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్య నాయక్, ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మంగ్లీ రాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శివలింగం కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరమణారెడ్డి కాలే మల్లయ్య మల్లేష్ నాయక్ శ్రీను నాయక్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమనగల్ మండల అభివృద్ధికి, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ఎంపీ మల్లురవిని కాంగ్రెస్ నాయకులు అభ్యర్థించారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



**వికారాబాద్, (సింగిడి):** జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల ఏర్పాటు కొనసాగుతోంది ఈ నేపథ్యంలో జిల్లా పరిధిలోని నవాబు పేట మండలం చిట్టిగిద్ద గ్రామంలో ఎమ్మార్పీఎస్ నవాబు పేట్ మండల ఇన్చార్జి దాసరి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని నియమించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా టి ప్రేమ్ కుమార్ మాదిగ. అధికార ప్రతినిధిగా నరేందర్ మాదిగ. ఉపాధ్యక్షులు దయాకర్. సురేష్ మాదిగ. ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాదిగ. కార్యదర్శి సుధాకర్ ప్రేమ్ మాదిగ. కోశాధికారి దయాకర్ ప్రచార కార్యదర్శి దయాకర్ కార్యవర్గ సభ్యులు. చంద్రశేఖర్ మల్లేశం కిషోర్ శివరాజ్ నవీన్ గౌరవ సలహా దారులు రాజు దయానంద్ చంద్రయ్య, నర్సింలు, అనంతయ్య, ఎన్నుకోవడం జరిగింది. సీనియర్ నాయకులు శేఖర్ రాంచందర్, నాగేష్, పరిగి మండలం చిట్యాల గ్రామ కమిటీని సీనియర్ నాయకుడు లాజర్ మాదిగ ఆధ్వర్యంలో ఇంచార్జీ రవికుమార్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చింతల నర్సింలుమాదిగ, ఉపాధ్యక్షులుగా యాదయ్య మాదిగ, సుధాకర్ మాదిగ, సురేష్ మాదిగ, గంగపురి మాదిగ, చెన్నయ్య మాదిగ, సుశాంత్ మాదిగ, శివకుమార్ మాదిగ, సిగ్గం మాదిగ, సలహాదారులు గా చెన్నయ్య మాదిగ, రవిమాదిగ,ఎల్లయ్య మాదిగ, లను ఎన్నుకొన్నారు. అనంతరం పరిగి, నవాబు పేట మండల ఇంచార్జ్ లు రవికుమార్, దాసరి సుధాకర్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు పోరాడి తమ హక్కులను సాధించుకున్నారని వాటిని నేటి యువత విద్య. ఉద్యోగాల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో మాదిగలు ఆర్థికంగా రాజకీయంగా ఉన్నత స్థాయిలోకి రావాలని అన్నారు అందుకు మాదిగలు సంఘటితం కావాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వశాంతి మహాయాగంలో పాపిశెట్టి కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు, (సింగిడి):** : కల్వకుర్తి పట్టణ కేంద్రంలో జరుగుతున్న 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు, కౌన్సిలర్ పాపిశెట్టి శ్వేతా రాము కుటుంబ సభ్యులు కళ్యాణి మరియు అరవింద్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ దివ్య మంగళ శాసనములతో ఈ యాగం కొనసాగుతోంది. విశ్వశాంతి, లోకక్షేమం మరియు ధర్మ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ వేడుకలో వారు స్వామీజీ ఆశీస్సులు పొందారు. నిర్వాహకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రేవల్లి మండలంలో వీధికుక్కల బెడద..

- వ్యాధిగ్రస్త కుక్కలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- వ్యాధిగ్రస్త కుక్కలతో చిన్నారులు, వృద్ధుల్లో తీవ్ర భయం
- పాఠశాలలు, కాలనీలు, ప్రధాన రహదారులపై గుంపులుగా సంచారం
- తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని మండల ప్రజల విజ్ఞప్తి



**రేవల్లి, (సింగిడి):** వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని తదితర గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. గతంలో అప్పుడప్పుడు మాత్రమే కనిపించే వీధి కుక్కలు ప్రస్తుతం గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో వ్యాధిగ్రస్త కుక్కలు ఇళ్ల ఆవరణల్లోకి, వీధుల్లోకి, పాఠశాలల పరిసరాల్లోకి రావడంతో చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇంటికి చేరుకునే ఉద్యోగులు వీధి కుక్కల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలను వెంటాడడం, ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకురావడం వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితులు తరచూ కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పలువురు చిన్నారులు బయట ఆడుకోవడానికే భయపడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో కుక్కలకు చర్మవ్యాధులు, ఇతర అంటువ్యాధుల లక్షణాలు కనిపిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. అలాంటి కుక్కలు చెత్త కుప్పలు, కాలువలు, ఇళ్ల ముందు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పరిసరాల్లో తిరుగుతుండటంతో ప్రజారోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కుక్కలు కరిస్తే రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉండటంతో ప్రజలు భయాందోళనలో జీవిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో చెత్త, మురుగు నీరు పేరుకుపోవడం, ఆహార వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ ఉండటం వల్ల వీధి కుక్కల సంచారం మరింత పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత లోపం కూడా ఈ సమస్యకు ఒక ప్రధాన కారణంగా చెబుతున్నారు. చెత్త నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ, గ్రామపంచాయతీలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్త కుక్కలను గుర్తించి చికిత్స అందించడం, వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టడం, రేబీస్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం, అవసరమైన చోట కుక్కలకు టీకాలు వేయడం, చెత్త నిర్వహణను కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి గ్రామంలో ఈ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాటసారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్య మరింత తీవ్రమయ్యేలోపు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్లాస్టిక్ సేకరణ డ్రైవ్ విజయవంతం

- పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ముందడుగు
- సుమారు 30 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ
- భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించడం అందరి బాధ్యత..: శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, (సింగిడి):** పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో తలకొండపల్లిలోని అక్షర స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్లాస్టిక్ కలెక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 30 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ కార్యదర్శి లయన్ జి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పునర్వినియోగం, రీసైక్లింగ్ కు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణంగా మారుతున్నాయి. వాటిని సక్రమంగా సేకరించి రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా కాపాడవచ్చని,. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యత, పరిశుభ్రత, సామాజిక సేవా భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయన్నారు.. విద్యార్థులు తమ ఇళ్లలో, గ్రామాల్లో కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురాగలరని అక్షర స్కూల్ గ్రీన్ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, కృష్ణకాంత్ తెలిపారు. క్లీన్ క్యాంపస్ -- గ్రీన్ ఫ్యూచర్ -- బెటర్ టుమారో" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని పి ఆర్ ఓ లయన్ పాషా తెలిపారు . లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ మోహన్ రెడ్డి, లయన్ సునంద, లయన్ అంజయ్య తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, రాధిక, అఖిల, స్వాతి, పాల్గొన్నారు .

# సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం





- ఎంపీ డా. మల్లు రవి
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయతో పనిచేయాలి
- అభివృద్ధే ద్యేయంగా ముందుకు సాగాలి
- ఆమనగల్లు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**ఆమనగల్లు, (సింగిడి):** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్లాలంటే అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయతో పనిచేయాలని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఓ అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీ మల్లురవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో మండలానికి సంబందించిన వివిధ శాఖల అధికారులు అన్ని గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. సమావేశంలో మండలంకు సంబందించిన పలు అభివృద్ధి అంశాలపై,అభివృద్ధి సమస్యలపై ప్రతి ఒక్క శాఖ నుంచి వచ్చి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ గ్రామ సర్పంచులు తమ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలని వారు సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమరు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సర్పంచ్‌లు ప్రస్తావించిన ప్రతి సమస్యను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. గ్రామపంచాయతీలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతమైన అమలుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.3.16 లక్షల

# చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నాయిని



**హన్మకొండ, (సింగిడి):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్ జూలైవాడకు చెందిన నేరెళ్ల నవీన్ ప్రియాంక దంపతుల కుమారుడు నేరెళ్ల శ్రేయాన్ భార్గవ్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గాయపడిన ఘటనపై స్పందించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 3,16,000ల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 3.16 లక్షల ఆర్థిక సాయం చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తక్షణమే స్పందించి సహాయం అందించడం తమ వంతు బాధ్యతగా భావిస్తున్నామని వారు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్,డివిజన్ ఇంచార్జ్ కౌటిల్ రెడ్డి,నాయకులు మానస రామ్ ప్రసాద్,నేపాల్ రెడ్డి,రాజ్ కుమార్ విద్యుత్ శాఖ డీ ఈ సాంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్**



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు పట్టణాభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ వినతిపత్రం అందజేశారు. పట్టణంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతుల కల్పన, సుందరీకరణ పనుల కోసం హెచ్ఎండీఏ లేదా ప్రత్యేక రాష్ట్ర నిధుల నుంచి ఈ నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నర్సింహ, సర్పంచ్ మండ్లి రాములు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు అవ్వారి శివలింగం, నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో.. ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యం.



**జవహర్ నగర్, (సింగిడి):** ఓ ప్రైవేటు ఉద్యోగి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... ఈనెల 31వ తేదీన మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ మత్తు స్వామి కాలనీకి చెందిన డేనియల్ (21) ప్రైవేట్ ఎంప్లాయ్ గా పని చేస్తూ బాలాజీ నగర్ లోని ముత్తుస్వామి కాలనీలో నివసిస్తున్నాడు. ఈనెల 31వ తేదీన డేనియల్ మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. ఈ మేరకు డేనియల్ తల్లిదండ్రులు డేనియల్ కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. వెంటనే అతని గురించి చుట్టుపక్కల వెతికిన బంధువుల వద్ద వెతికిన అతని సమాచారం లభించలేదు. ఈ మేరకు డేనియల్ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నర్సింగ్ ఆఫీసర్ ల సస్పెన్షన్

# ఎత్తివేయాలని నిరసన




**కమలాపూర్, (సింగిడి):** నర్సింగ్ ఆఫీసర్ ల సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ కమలాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శనివారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో కొద్ది రోజుల క్రితం ఇటీవల ఐదుగురు బాలింతలు అస్వస్థతకు గురైన విషయంలో, నర్సింగ్ ఆఫీసర్ లను నేరుగా సస్పెన్షన్ చేయడం దుర్మార్గం అని అన్నారు. నిరసన తెలుపుతున్న నర్సింగ్ ఆఫీసర్ లకు సూపరింటెండెంట్ డాక్టర్ చందు నాయక్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. బాలింతల కేసు విషయంలో నర్సింగ్ ఆఫీసర్ లను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా కండిస్తున్నామన్నారు. సిబ్బంది వల్ల ఏదైనా తప్పు జరిగితే ముందుగా మెమో ఇవ్వాలి గాని సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో నర్సింగ్ వృత్తికి రావాలంటేనే భయపడే పరిస్థితిని ఉన్నతాధికారులు తీసుకువస్తున్నారనియు ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవి,అపర్ణ,స్వప్న,ప్రణీత, స్నేహ,వరుణ్ మాధవ్,ప్రవణ్య నర్సింగ్ ఆఫీసర్ లు దుర్గా లోకేశ్వరి, స్వప్న, నెబ్లా,సరిత,సుమన్, షీబా,అనిత కుమారి,అనిత,కళ్యాణి, బ్యూలా సులోచన,రజిత, ఫార్మసిస్ట్ సుశ్రిత, జూనియర్ అసిస్టెంట్ శివ కార్తీక్,ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




సినిమా సింగిడి
Cinma Singidi
మంగళవారం
4-8-2026

## ఎల్లమ్మలో పర్షిగా దేవిశ్రీప్రసాద్ లుక్ విడుదల



దిల్ రాజు సమర్పణలో, 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్దండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్షిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్దండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గతకొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాదన్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్షిగా అతను లుక్‌ను విడుదల చేశారు.

## స్పైడర్ మ్యాన్ కెలక్షన్ల దూకుడు



టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ. 2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ. 11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ. 310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.

## అతీంద్రియ శక్తుల కథ...

# అగధ

### 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం



ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## నితిన్ హీరోగా నాని మూవీ అలియాస్ రుక్మిణీ అనే టైటిల్

హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ ' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది.



ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 'గరం గోపాల్', 'ఆమెకు ఆమెంటే ఇష్టం', 'వత్రం వెంకన్న' వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా 'రుక్మిణి' అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది. ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ 'ఆమె నా భార్య' అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత క్యూరియాసిటీ పెరిగింది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది. నితిన్ కెరీర్‌లో ఇది మరో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం అని తెలుస్తోంది. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో మేకర్స్ చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. నాని సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో నాని నిర్మాణంలో వచ్చిన పలు చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ కూడా పొందాయి. దీంతో 'అలియాస్ రుక్మిణి' కూడా కంటెంట్ ఆధారిత చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. త్వరలోనే హీరోయిన్, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం ప్రకటించనుంది. టైటిల్ గ్లింప్స్‌తోనే ఆసక్తిని పెంచిన 'అలియాస్ రుక్మిణి' ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో

## ఇరుముడి నుంచి యాలాలో..యాలాలో పాట విడుదల

### 21న విడుదలకు సిద్ధం అవుతున్న చిత్రం





మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రీ?కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంది. తన కూతురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా మేకర్స్ తెరదించారు. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేశారు. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

singidinews@gmail.com

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090